# బాల



6

# "బాల" పాతకాపీలు

"బాల" పాతకాపీలు "కావాలి, కావాలి" అని అనేకమంది కోరుతున్నారు. కాని, మావద్ద అన్ని సంచికలూ లేవు. ఈ దిగువ వివరించిన సంచికలు కొద్ది ప్రతులుమాత్రమే వున్నవి. కావలసినవారు వెంటనే వ్రాయండి. వీ. పీ. పద్ధతిలేదు.

| | | | |
|---|---|---|---|
| 1945 | అక్టోబరు | మాస్టర్ పండూ "బాల" | 0- 6-0 |
| ,, | నవంబరు | శ్యామల "బాల" | 0- 6-0 |
| 1946 | జనవరి | సంక్రాంతి సంచిక | 0-12-0 |
| ,, | ఫిబ్రవరి | గాంధీ "బాల" | 0- 6-0 |
| ,, | మే | వంతులాట "బాల" | 0- 6-0 |
| ,, | జూన్ | పిల్లి - ఎలుకా "బాల" | 0- 6-0 |
| ,, | జులై | తాత గుర్రం "బాల" | 0- 6-0 |
| ,, | ఆగస్టు | పుట్టినరోజు సంచిక | 1- 0-0 |
| ,, | సెప్టెంబరు | బెలూను "బాల" | 0- 6-0 |
| ,, | అక్టోబరు | కోడి బండీ "బాల" | 0- 6-0 |
| ,, | నవంబరు | గిరిజ "బాల" | 0- 6-0 |
| | | | 5- 2-0 |
| | | పోస్టేజి (రిజిస్టర్డు) | 0- 6-0 |
| | | మొత్తము | 5- 8-0 |

వెంటనే మనియార్డరు ఈ దిగువ ఎడ్రసుకు పంపండి.

మేనేజరు: "బాల"

మైలాపూరు, మదరాసు 4.

పసిపాపల
పాలిటి
శ్రీరామరక్ష






## మెక్లెక్
## గ్రైప్ కాల్

పసిపాపలకు సాధారణంగా కలిగే అజీర్తి, మందమూ మొదలగు వాటికి అమోఘమైనది. శిశువులకు హితకరమైనది.

పెరిగే పిల్లలకు పుష్టి నొసగే
మెక్లెక్ ఆహారము

- చిల్డ్రన్స్ ఫుడ్
- సిరప్ కాల్విటాల్




కెమిస్టు లందరియొద్దగాని,
మా యొద్దగాని దొరకును.

Meclec

ది మెక్లెక్ న్యూట్రిమెంట్స్
అండ్ ఫార్మస్యూటికల్స్, లి.
99-ఎ. ఆర్మీనియన్ వీధి, మద్రాసు 1.

# బాలలూ!

మీకు కొత్త పండుగకు
సరికొత్త చిత్రం వస్తోంది!

శ్రీ వెంకట్రామా పిక్చర్సువారి



# బ్రహ్మరథం

అంతాచూచి ఆనందించండి

| కవి: | సంగీతం: | నృత్యం: | స్టూడియో: |
|---|---|---|---|
| బలిజేపల్లి | మోతీబాబు | వెంపటి | శోభనాచల |

దర్శకుడు:

## చిత్రపు నారాయణమూర్తి, బి. ఎ.


అద్దంకి, పారుపల్లి, రఘురామయ్య, రామారావు, జయమ్మ, సరోజ, సౌదామిని, టి. కనకం, శ్రీరంజని, అనసూయ నటించినది.

ఆంధ్ర: పూర్ణా పిక్చర్సు, బెజవాడ.
రాయలసీమ: మల్లిఖార్జున పిక్చర్సు, నంద్యాల.
నైజాము: దక్కన్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్సు, హైద్రాబాద్.

వివరములకు: **టి. పి. సుందరం,**
బాలాజినగర్, రాయపేట, మదరాసు.

# మోటు,-వానియొక్క నలుగురు స్నేహితులు

(ముందటి కథ) **2**



ఓ! అది మోటు!

"దయచేసి మమ్ములను కాపాడుడు", అని నలుగురు బాలురు ఏకకంఠముతో అరచిరి.

మోటు నవ్వుచు ఇట్లనెను: "మీకు నేను తగురీతిని సహాయము చేసెదను. నా వీపుమీద కూర్చుండుడు. నదిలో స్నానము చేయుదము."

అప్పుడే వాని యజమాని హిమత్ రాయ్ అచటికి వచ్చెను.

ఇప్పుడేమి జరుగును? వచ్చే నెల సంచికలో చూడుడు.







ది తాతా ఆయిల్ మిల్స్

కం|| లిమిటెడ్.



# ది నాగపూర్ పయనీర్ ఇన్‌షూరెన్సు కంపెనీ, లి.

హెడ్ ఆఫీసు:

పయనీర్ బిల్డింగ్సు, నాగపూరు సిటీ.

★

## 1945 సం॥లో వ్యాపారాభివృద్ధి

| | | |
|---|---|---|
| అమలులోవున్న వ్యాపారం | రూ | 58,27,000 |
| జీవిత నిధి | ,, | 11,23,000 |
| క్రొత్త వ్యాపారం | ,, | 25,58,000 |
| నిలువలు | ,, | 14,39,000 |

★

31-12-44 నాటికి విలువ { నికర లాభము రూ 52,027

## బోనస్సు:

యావజ్జీవపు, ఎండోమెంటు భీమాలపై 1000 కి సంవత్సరానికి రూ 10/లు

: వివరాలకు :

పి. యస్. ఆర్. శర్మ, బ్రాంచి సెక్రటరీ,

నాగపూర్ పయనీర్ ఇన్‌షూరెన్సు కంపెనీ, లిమిటెడ్.

నెం. 3, తంబుచెట్టివీధి, మద్రాసు 1.



We all use **SRIVIS-AMLA**
**HAIR OIL**

మేమందరమూ

శ్రీవిస్ - ఆమ్లా




తలనూనెనే వాడెదము — ఎందుకంటే ఇతరనూనెలు ఏవివాడినా, కురులు ఇంత నిగనిగలాడవు. కురులు దువ్వుటకు మృదువుగానుండి, నీటుగా ప్రకాశించును. శ్రీవిస్ - ఆమ్లా కురులను పెంపొందించునని కూడ మరువకుడు.

**S. VISWANADHAM & CO**
**44, BUNDER ST. G.T. MADRAS**




## వ్యాపారసులకు

# మా ఉగాది కానుకలు

సరుకులు తక్కువ ధర కిచ్చేస్థలానికే రండి మరియు వ్యాపారస్థుల మన్నికల ననుసరించి, బైటూరి ఆర్డర్లను నిరంతరం సప్లయి చేయుటకు విశేషంగా నిల్వచేసి వుంచినాము, మా కంపెనీయందు.

| | | | |
|---|---|---|---|
| సన్నరాష్ట్రిం | కస్తూరిపసుపు | వట్టివేరు | పరంగిచెక్కా |
| జాజికాయ | మానుపసుపు | వస | మాపళకాయ |
| జాపత్రి | లవంగపట్ట | అక్కల్‌కారా | కచ్చూరాల్ |
| పిప్పిళ్లు | లవంగాలు | చలవమిరియాలు | మూశాంబరం |
| నేర్వాళం | వాయువులంగ | ఓమం | పాల్‌మడి |
| శొంఠి | ఆజమోదరం | సాంబ్రాణి | సుగంధవేరు |

ఇలాంటివి మావద్ద యితర రకాల మందుల మూలికిలు లెక్కలేనన్ని లభించును. లభించు స్థలము :

ఎగుమతి దిగుమతిదారులు :

# D. PEIRIS & CO.,

(BRANCH) 24. BADRIAN ST. G.T. MADRAS (TEL: SUMATIPALA)

PHONE: 5196. TEL: REDWOOD

NO. 8-10. GABO'S LANE, (HO) PETTAH, COLOMBO.

సంపాదకుడు :
న్యాయపతి రాఘవరావు బి.ఏ.

సహాయ సంపాదకురాలు :
న్యాయపతి కామేశ్వరి, బి.ఏ.ఎల్.టి.

# బాల

'BALA' CHILDREN'S ILLUSTRATED MONTHLY.

సంపుటి 2 ] మార్చి 1947 [ సంచిక 8.

## తప్పనిసరి

ఆటల్లో వున్న సరదా చాలా మందికి బడికి వెళ్లడంలో వుండదు. ఎందుచేత? ఆటల్లో మన ఇష్టం వచ్చినట్టు సరదాగా గెంతవచ్చును, నవ్వవచ్చును, కేకలు వేయవచ్చును. బడిలో అయితే అక్కడ నిశ్శబ్దంగా కూర్చోవాలి, బడి పంతులు చెప్పేవన్నీ వినాలి. లెక్కలు చెయ్యాలి; అప్పుడప్పుడు బెంచీ ఎక్కాలి.

అలాగని బడికి వెళ్లడం మానేస్తే ఎలాగ? చదువు రావొద్దూ? చదువులో మన తెలుగు పిల్లలు చాలా వెనకబడివున్నారు. 100 మంది పిల్లల్లో 13 మంది మాత్రమే బడికి వెళ్తున్నారు; మిగిలిన 87 పిల్లలూ బడికి వెళ్లనందున వారికి చదువులేదు.

నైజాం సంస్థానంలో వున్న మన తెలుగు పిల్లలగతి ఇంకా హీనంగావుంది. నూటికి 9 మంది మాత్రమే బడికి వెళ్తున్నారు.

ఎలాగైతేనేమి, బడులకు వెళ్లని పిల్లలు, బడులకు పిల్లల్ని పంపని తలితండ్రులు అనేకులు వున్నారు. అందరు పిల్లలూ చదువుకొని అన్ని సంగతులు తెలుసుకుంటేనేగాని మన దేశంగాని, మనభాషగాని బాగుపడదు.

అందుచేత, ప్రభుత్వంవారు పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించేపద్ధతి పెట్టారు. కాని అన్ని గ్రామాలలోనూ యీ పద్ధతిలేదు. ఈ ఏడు ఇంకా లక్షన్నర పిల్లలకు తప్పనిసరిగా చదువు నేర్పించే ఏర్పాటు చేశారు. సంతోషమే కాని, త్వరలో మన ఆంధ్రరాష్ట్రం వచ్చి, అన్ని గ్రామాలలోనూ, అందరు పిల్లలకూ సరియైన చదువు చెప్పించే రోజులు ఎప్పుడు వస్తాయో!





# పండుగ

## పట్టు

అక్క యిచ్చింది
అరటి పండు

బావ తెచ్చేడు
బాదం మిఠాయి

నాన్న తెచ్చేరు
నాను కతాయి

అమ్మ పెట్టింది
పప్పూ అన్నం

◆ ◆ ◆

అన్నీ కలిపి
కొట్టూ కొట్టూ
పండుగ పట్టు
పట్టూ పట్టూ





రచన: శశిరేఖ

1-వ ఫారం, విజయనగరం.

# పొట్టిబావ - పండుగ పచ్చడి

రచన: పి. జయరావు. (తంగుడుబిల్లి)



పొట్టిబావ

చిట్టి మరదల చిట్టి మరదల
ఎక్కడి కెళతావు?
గున్న అంటు మావులున్న
తోఁట కెళతాను.
చిట్టి మరదల చిట్టి మరదల
ఏమి తెస్తావు?
మంచి మంచి మామిడికాయలు
ఏ రి తె స్తా ను.
చిట్టి మరదల చిట్టి మరదల
ఏ మి చే స్తా వు?
వస్తూఉన్న ఉగాదికి
ప చ్చ డి చే స్తా ను.

# బాల ఇల్లు కట్టింది

రచన: మంత్రిప్రగడ సూర్యనారాయణ (పార్వతీపురము)

చిట్టీ చిట్టీ బాలమ్మా
చింతాచెట్టూ కిందంటా
చిన్నాయిల్లూ కట్టిందీ
చిగురూ ముగ్గులు పెట్టిందీ
చూడా చక్కని యిల్లంచూ
చూడావచ్చే!
వాడంతా—

చిన్నా చెల్లీ వచ్చిందీ—
చిట్టీ సుబ్బీ వచ్చిందీ—
పొట్టీ పిచికా వచ్చిందీ—
పచ్చనిచిలకా వచ్చిందీ!—


చెల్లీ చేసిందెన్నో పనులూ,
సుబ్బీ చుక్కలు పెట్టిందింటికి,
పొట్టి పిచికా పెట్టెను దేవుని:
పచ్చని చిలకా పాడెను పాటలు.

నల్లని మబ్బులు వీచాయీ
జిగ్ జిగ్
బడబడ
పడింది వర్షం—

పచ్చని చెట్లూ
పూసేయి పూలూ
వాసన మోసుకు వచ్చేగాలీ.

బాలమ్మిల్లూ
చూడాలంచూ
చంద్రుడు లేచా డాకాశంలో

బాలమ్మా చక్కని చుక్కా
బాలమ్మిల్లొక భూతలస్వర్గం.



## "మా బాబు"



చి॥ ఆత్తులూరి లక్ష్మినారాయణ
(ఖమ్మంమెట్టు)

## "ముద్దు బాల"



చి॥ ప్రేమ (మదరాసు)


# పెప్పర్ మింట్ లేదా



మీరు కావలసిన రుచి ఏమిటో సరిగ్గా తెలుసుకోవటంలో ఎంత ఆనందం ఉంది! ఈవేళ పెప్పర్ మింట్ ఇష్టం. రేపు కేరామెల్ ఇష్టం కావచ్చు. కె.సి.పి. వారు అన్ని రకాలూ తయారు చేస్తారు. వాటి అన్నిటిలోనూ తప్పకుండా ఉన్న ముఖ్యలక్షణం లోపంలేని పరిశుభ్రత.

దేశమంతటా ఆదరించబడినవి.



# సావరిన్ స్వీట్స్

కె. సి. పి. తయారీ

KCK-2TG

సరికొత్త వ్యాకరణం

# లేదు + లేదు = ఉన్నది

[ఈ కథలో వ్యాకరణం వలన ఉపయోగాలు తెలుస్తాయి. చదవండి]

రామం చాలా కొంటె పిల్లవాడు. కాని చాలా తెలివైనవాడు కూడానూ. ఒక రోజున రామం నాన్న, రామానికి వ్యాకరణంచెప్తున్నారు. "ఓరేరామం! ఎక్కడేనా రెండుమాట్లు లేదు లేదు అని వస్తే దాని అర్థం ఉన్నది అని అవుతుంది, తెలిసిందా? ఈ వాక్యం చూడు 'ఆ అమ్మాయి ప్రొద్దున్నే లేవలేదు అన్న రోజులేదు.' ఇప్పుడు తెలిసిందా?" అని అడిగేరు. రామం అప్పటికి తెలిసిందన్నాడు.

బాలా! రామానికి ఒక చెల్లెలు కూడా వుంది. తెలుసా? మీరు మీ అక్కలు, అన్నలు ఏమిచెప్తే అది వింటారుగాదూ! అలాగే ఆ చెల్లెలుకూడా రామం ఏది చెప్తే అదే వింటుంది.

మరునాడు రామానికి తన బడి పిల్లలను పిలిచి విందు చేయా లనిపించింది. చెలెలికి చెప్పేడు. సరేనంది. ఇద్దరూ కలసి అమ్మదగ్గిరికి వెళ్లేరు. అమ్మని అడగుతే వద్దంది. వీళ్ళిద్దరూ ఇంకా మొండిపట్టుతే వీళ్ళఅమ్మ "లేదు. ఇంట్లోపంచదార అదీలేదు. అంచేత చెయ్యడానికి వీల్లేదు." అంది.


రామం చాలా సంతోషించేదు. పాపం చెల్లెలికి దీనిఅర్థం తెలియ లేదు. మర్నాడు వాళ్ళమ్మ ఎక్కడికోవెళ్ళింది. రామం తన స్నేహితులందరినీ పిలిచేడు. ఇంట్లోవున్న అటుకులన్నీ తీసేడు. దాంట్లో పంచదార కలిపి అందరూ తిన్నారు. ఇంతలోకే వాళ్లమ్మవచ్చి ఇదంతాచూసింది.

రామాన్ని కోప్పడింది ఎందుకు చేసేవని. రామం నవ్వుతూ. “అమ్మా! నాన్న నిన్న వ్యాకరణం చెప్పేరు రెండుసార్లు ‘లేదు’ అని కాని వస్తే ఉన్నది అని అర్థం అవుతుందని నిన్న నువ్వు, “లేదు పంచదార లేదు” అన్నావు. అంటే పంచదార వుందని అర్థం కాదూ?” అన్నాడు.

వాళ్ళ అమ్మకి ఏం చెయ్యాలో తెలియలేదు. ఇంతలోకీ సాయంకాలం వాళ్ళనాన్న వచ్చేరు. అమ్మ నవ్వుతూ వ్యాకరణం వల్ల వచ్చిన లాభం అంతా చెప్పింది. అతనుకూడా నవ్వి రామాన్ని ఇంకెప్పుడు అలా చెయ్యొద్దని చెప్పేడు.

బాలా! మంచి అర్థాలు తీస్తే వ్యాకరణం చాలా బాగుంటుంది కాదూ?

రచన: శేషశాయి (4 ఫారం), నాగపూరు.




తండ్రి :—ఏమిరా వెధవా మూడో సంవత్సరంకూడా పోయిందేం పరీక్ష!

కొడుకు :—(ఏడుస్తూ) మరి నువ్వు ప్రతి సంవత్సరం ఇలా తలకాయమీద బాదుతూంటే, బుర్ర సరిగా పని చేయక మేష్టారు చెప్పిన పాఠాలు బుర్రలో కెక్కటం లేదు. నేనేం చేసేది నాన్నా!?

ఊఁ....ఊఁ....ఊఁ....

“బాపు”




# ఆగ్రా

చాలా కాలం క్రిందట ఢిల్లీ నగరంలో 'శికందర్ షా' అనే మహమ్మదీయరాజు రాజ్యం చేస్తూండేవాడు. ఆ రాజునే 'సుల్తాన్' అనేవారు. ఈ సుల్తానుకు శత్రువులు చాలామంది వుంటే, వాళ్లందరు ఏకమై ఆయన్ని ఎప్పుడూ నానాబాధలు పెడుతూ, ఆయనమీదికి యుద్ధాని కొచ్చేవారు. వాళ్ళ బాధ పడలేక, ఎట్లాగైనా వాళ్లందర్ని నాశనం చేసి, సుఖంగా రాజ్యం పరిపాలించా లనుకున్నాడు సుల్తాను. ఆ శత్రువులందర్ని ఓడించి నాశనం చెయ్యటానికి వీలుండేలాగా పెద్దవూరిని, కోటనుకట్టి అక్కడే తనసేన లుంచాలనుకున్నాడు.

వెంటనే ఢిల్లీకి దక్షిణంగా యమునానది తీరానుండే ఒక పల్లెటూరు పక్కనే పెద్దనగరం కట్టించి, దానికి 'ఆగ్రా' అని పేరుపెట్టాడు సుల్తాను. ఆగ్రా నగరంలోనే మేడమిద్దెలు కట్టించి అక్కడే నివసించేవాడు సుల్తాను. ఏడాదిలోపలే పెద్ద భూకంపం వచ్చింది.- అంటే భూమి గడగడ వణికి మేడలన్ని ఒక్కసారి కూలి పడ్డాయి. పాపం, సుల్తానెంతో విచారించాడు. అంతటితో వూరుకోక ఆగ్రా నగరాన్ని యింకా అందంగా కట్టించాడు.

తర్వాత కొంత కాలానికి 'షాజహాన్' అనేరాజు రాజ్యాని కొచ్చాడు. ఆ రాజుకి ఆగ్రాఅంటే

చాలాఇష్టం. ఆగ్రాలోని కోటలో చలువరాతితో 'మోతీమశీదు' అనే మశీదును కట్టించాడు. ఆ మశీదు తెల్లగా, నున్నగా, ఎంతో చక్కగా వుంటుంది.

షాజహాను భార్య చాలా చక్కనిది. ఆమె పేరు "అర్జుమంద్ బాను." ఆమె భర్తని ప్రేమించి, అతని కెన్నోవిధాల సహాయం చేసేది. షాజహాను కామెమీద ఎంత ప్రేమను న్నారు! ఆమెకు "ముంతాజ్ మహాల్" అని ముద్దుపేరు పెట్టుకున్నాడు.

ఒకసారి ముంతాజమహాల్‌కు చిన్నపాప పుట్టింది. ఆ పాప పుట్టగానే వాళ్ళమ్మ చనిపోయింది. అప్పుడు షాజహాను ఎంతగా దుఃఖించాడో ఎవ్వరూ చెప్పలేరు! ఆమెకో గోరీ కట్టించాడు. అంతటితో తృప్తిపడలేదు. ఆమె ఎంత అందమైనదో అంత అందమైన గోరీ కట్టాలనుకున్నాడు. ఆమెపేరు ఎప్పటికి ఎవ్వరు మరవకుండా చక్కని భవనం కట్టించి ఎక్కడోవున్న ఆమె గోరీని తెచ్చి దానిలో వుంచాడు షాజహాను. కొన్నాళ్లకు షాజహానుకూడా చనిపోయాడు. అతని గోరీనికూడా భార్య గోరీ పక్కనే కట్టారు. ఈ రెండు గోరీలు ఆ భవనం లోపల చీకటిలో వుంటాయి. అక్కడ కెళ్ళితే ఒక ముసలితాత దీపం తీసుకొని మన కన్ని చూపిస్తాడు.


ఆగ్రాలో యమునానదితీరాన చక్కటితోటలో వుందాభవనం. అదే 'టాజమహాల్'. దీన్ని కట్టడాని కెన్నోలక్షల రూపాయలు ఖర్చుపెట్టాడు షాజహాను. పద్దెనిమిది సంవత్సరాలకు పూర్తయింది. ఈ టాజమహాల్‌ను తెల్లని చలువ రాతితో కట్టారు. ఉంగరాలలో ధగధగ మెరిసే వజ్రాలు యిమిడ్చినట్లే టాజమహాల్ గోడల నిండా వజ్రాలు యిమిడ్చేశారు. దాని లోపలుండే రెండు గోరీల నిండా వజ్రాలే!

అసలు టాజమహాల్ అందం చూడాలనుకుంటే మంచి వెన్నెల్లోనే చూడాలి. వెన్నెల్లో టాజ

మహల్ మరింతకాంతిగ చంద్రుడి లాగే మెరుస్తూంటుంది. ఆరంగు రంగుల వజ్రాలు ఆకాశంలో నక్షత్రాల్లాగా మిణుకు మిణుకు మంటూ వుంటాయి. అబ్బ! ఆ తమాషా చూచేతీరాలి. నిజాని కది గోరీయేకాని, చూస్తే ఏ దేవతలో నివసించే భవనంలా గుంటుంది. చూచేకొద్దీ ఇంకా చూడా లనిపిస్తుంది.

టాజమహల్ ప్రపంచంలో కంతకీ అందమైన భవనం. అంతే కాదు. ప్రపంచంలోని విచిత్రమైన వాటిలో ఒకటి. ఇంత గొప్పదాన్ని తప్పక చూడాలని అమెరికా, ఇంగ్లండు లాంటి విదేశాలనుంచి చాలామంది ఆగ్రా నగరానికి వస్తారు. అన్ని నగరాల్లాగే ఆగ్రాకూడా గొప్పనగరం. అక్కడ చలువరాతితో మంచి మంచి బొమ్మలెన్నో తయారు చేస్తారు. కాని అన్నిటిలోకి టాజమహల్ బొమ్మలే ఎంతో ముద్దు వస్తూంటాయి. ఆగ్రాకువచ్చిన వాళ్ళందరూ యీ బొమ్మల్ని తప్పక కొంటారు.

ఆలాగే మీరుకూడా ఆగ్రా కెళ్ళి, టాజమహల్ చూచి, బొమ్మలుకూడా పట్టుకొచ్చి అందరికి చూపించాలి.



టాజ్ మహల్

# పాత పాఠాలే!

రచన :
ములుగు తిరువెంగళాచార్యులు
టీచర్
గరల్సు హయ్యరెలిమెంటరీ స్కూలు
మోర్త
బొమ్మ :
పి. వి. రామారావు
(విశాఖపట్టణము)



పాత పాత - పాఠాలే
రాతటోయి - మా కెపుడు
చేతకాని - పంతులూ!
చెరుపుతావ? - చిన్నాళ్లని!

ఈ కాలపు పాఠాల్ - నీ
కాలంలో - లేకపోతె
బాలే నీ - కీనాడవి
యేలాగో - నేర్పుతుంది
చాలుగాని పంతులూ!
'బాల' నడుగు - పంతులూ!

# నా కథ

ఆరోజులు తలచుకుంటే నాకే నవ్వు వస్తోంది. క్లాసులో నాకన్న మొద్దువుండేవాడుకాడు. మాష్టారు చెప్పేవేవీ బుర్రకెక్కేవి కావు. పరీక్షలలో నాకన్నా చివరిమార్కు తీయాలని యెందరెందరో ప్రయత్నించి విఫలులయారు. గాడిదకున్న తెలివి కూడా నాకులేదని హేళనచేసేవారందరూ. సోమరితనమునకు సంబంధించిన పోటీ లేవేనా పెడితే నాకు ఫస్టుప్రైజు వస్తుందనేవారు, నన్నుడికించడానికి.

నాకీ దౌర్భాగ్యపుస్థితి యెలా పోయేదా అని యేడ్చేవాడిని.

నాతల్లి చలువవల్ల నాలో ఆరు రోజులలో అద్భుతమైన మార్పు కలిగింది. ఏమరపాటుతనం యెగిరిపోయింది. నా సోమరితనం నశించింది. మఱపుటవగుణం మాయమైంది. ఆ తరువాత మా తరగతిలో ప్రతి పరీక్షలోను నాదే ఫస్టుమార్కు; ప్రతి పోటీలోను నాకే మొదటి బహుమతి. విద్యార్థులలోకల్లా మేటి ననిపించుకున్నాను.

దీనికి కారణం తెలుసా?—

మాఅమ్మ ఆ ఆరురోజులూ వరుసగా **తిలక్ మార్కు మిశ్రీ ఇంగువను** వాడి కూరలు, పులుసులు, పచ్చళ్లు వగైరా చేసి భోజనం పెట్టేది.


ఈ ఇంగువను తయారుచేసిన:

## గోపాల్జీ చంప్సీ అండ్ కో

(30, గోవిందప్పనాయక వీధి ♦♦ జి. టి. మద్రాసు)

వారికి నా ధన్యవాదాలు.

# పా ట ల  బా ట లు



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ము | స్వ | లు | జం | ప | ల్ల | రం | గ |
| డు | ర | ము | టు | ర | వృ | త | యు |
| పా | ర | కా | లు | స్వ | ట | లు | లు |
| గా | ము | లం | అ | లు | స్వ | శో | అ |
| ర | లు | గీ | త | ము | ర | వ | ష్ట |
| త్వ | ర్ణ | వ | లు | తు | జి | జా | ప |
| లా! | ము | లు | కే | ర్త | న | లు | మే |
| బా | లు | టు | పా | వ | జ | భ | లు |

బాలా! నీవు సంగీతం నేర్చుకుంటావా? ఈ దారి వెంబడి వెళ్లేవంటే సంగీతం వొస్తుంది. జాగ్రత్తగా వరుస కనుక్కో.

మండపాక వెంకట పద్మావతి,
(టఫాంగ్)

# పెరుగు పడుచు

రచన : ''సాహిత్య విశారద''
కర్ణ రాజశేషగిరిరావు
(మచిలీపట్టణము)




పెరుగమ్మ - పెరుగమ్మ
మెరుగిచ్చె పెరుగమ్మ
సత్తువ నిచ్చేటి
చక్కని పెరుగమ్మ

దుత్తలో పాలతో
తోడివేసిన చల్ల
కరుడు గట్టగ గూడు
గడ్డంటి పెరుగమ్మ
కడుపులు నిండేటి
కమ్మని పెరుగమ్మ



మీగడ గట్టిన
　　మృదువైన పెరుగమ్మ
నాణ్యమైన పెరుగు
　　నమ్మండి మీరంత
సరిక్రొత్త పెరుగమ్మ
　　చవిజూచి కొనరమ్మ
రమ్మని పిలువక
　　కమ్మని పెరుగును
జాగుచేసెదరేల
　　వేగిరింపక మీరు
ఊరూర తిరుగుచు
　　నోరూరుచేసెడి ॥ పె॥



# మీ స్నేహితులు ఎవరు?

రచన: "మెడికో", విశాఖపట్టణం

''అమ్మాయ్ సత్యా, అన్నయ్యను పిలు అన్నం తిందురు గాని.''

''అన్నయ్యా''

''ఆఁ''

''అమ్మ పిలుస్తోంది అన్నానికి''

''వస్తున్నా''

అన్నా చెల్లెండ్రు యిద్దరూ అన్నం తింటున్నారు అనేక గొడవలు మాట్లాడుకుంటూ. తల్లి కూడా దగ్గరేవుంది.

''పెరుగు యెంత బాగుందే అమ్మా. పాలల్లో కాస్త తోడంటు వేస్తే యెంత కమ్మని పెరుగు తయారవుతోంది! భలేచిత్రంగా వుందికదూ? అన్నయ్యా.''

''చిత్రమేముందిగాని చెల్లీ, అసలీ పెరుగు యెలా తయారవుతోందో తెలుసా?''

''తెలీదన్నయ్యా చెప్పు చూద్దాం''

''సూక్ష్మజీవులవల్ల చెల్లీ''

''సూక్ష్మజీవులంటే యేమిటి? అవి యెలా వుంటవి?''

''సూక్ష్మ జీవులంటే చాలా చిన్నప్రాణులు. అవి మనకంటికి కూడా కనిపించనంత చిన్నవి.''

''అంత కంటికే కనిపించకపోతే అవి వున్నయ్యని యెలా తెలుసుకోవడం? అన్నయ్యా!''

''సూక్ష్మదర్శిని అనే యంత్రం వల్ల చెల్లీ.''

''సూక్ష్మదర్శిని అంటే?''

''సూక్ష్మదర్శిని భూత అద్దాలతో చేయబడుతుంది. దాని సహాయంవల్లచూస్తే చిన్నచిన్న వస్తువులుకూడా పెద్దవిగా కనిపిస్తాయి. రేపు నిన్ను మా కాలేజీకి తీసికెళ్లి చూపిస్తానుండు.''

''అయితే యీసూక్ష్మజీవులు ఒక్క పెరుగులోనే వుంటాయా?''

''ఒక్క పెరుగులోనే కాదు చెల్లీ, ప్రపంచమంతట వ్యాపించి వుంటాయి. నీళ్లల్లోను, గాలిలోను భూమిలోనూ ప్రతిచోటా. చెప్పితే నమ్ము నమ్మకపో మననోట్లో పదిహేనురకాల సూక్ష్మ జీవులు, మన ప్రేగులలో డెబ్బది రకాల

సూక్ష్మజీవులు వున్నాయి. మనం ప్రతిరోజూ మలమూత్రాలద్వారా కోటానుకోట్ల సూక్ష్మ జీవులను విడుస్తున్నాం.''

''పెరుగు సూక్ష్మజీవులవల్ల తయారౌతూంటే అమ్మ పాలల్లో తోడంటువేయటం యెందుకు అన్నయ్యా?''

''తోడంటువేయటం అంటే పాలకు కొన్ని పెరుగును తయారుచేసే సూక్ష్మజీవులను కలపడం అన్నమాట. అప్పుడు ఒక సూక్ష్మజీవినుండి అనేక సూక్ష్మజీవులు పుట్టి ఆ పాలను పెరుగ్గా మారుస్తాయి.''

''కాసేపట్లో ఒక జీవినుండి అనేకజీవులు పుడతాయా?''

''అవును సత్యా! పన్నెండు గంటల్లో ఒకజీవినుండి అధమం 16,777,217 జీవులుదాకా పుట్టుకొస్తాయి.''

''సరేగాని అన్నయ్యా యివి ఒక్క పెరుగునేగాక ఇంకేమైనా తయారుచేస్తాయా?''

''వెన్న, జున్ను, రొట్టె, కాఫీ, టీ, కోకో ఒకటేమిటి. మనం అనుభవించే ప్రతీది యీ ప్రాణులవల్లే మనకు దొరుకుతుంది. నిజానికి అవి లేకపోతే ప్రపంచమే లేదు చెల్లీ.''

''అవి మనకింకా యేమేమి చేస్తున్నాయో చెప్పు అన్నయ్యా నాకు వినాలనివుంది.''

''మనం తిండికి బట్టకు వేటిమీద ఆధారపడి వుంటాం?''

''చెట్లమీద.''

''చెట్లు బాగా అభివృద్ధి పొందాలంటే?''

''వాటికి తగిన ఆహారం నీరు కావాలి.''

''ఆహారం చెట్లకు యెవరిస్తున్నారో తెలుసా! యీ సూక్ష్మజీవులే. ఇవి గాలిలోని నత్రజని అనే వాయువును తీసికొని భూమిలోని మరికొన్ని పదార్థాలతో కలిపి నేలను సారవంతంగా చేస్తాయి. చెట్లు తమకు కావలసిన పదార్థాలు నేలనుంచి తీసికొంటాయి. కొన్నికొన్ని సూక్ష్మజీవులు నత్రజనిని తీసికొని తమంతట తామే చెట్లకు అందిస్తాయి.

నీవు త్రాగే కాఫీ, టీ యెక్కడినుంచి వస్తున్నాయనుకున్నావ్? యీ సూక్ష్మజీవులు తేయాకు

లోనిచేదు కాఫీగింజలలోని చేదు తీసి వాటికి మంచిసువాసన కలుగ జేస్తున్నాయి.

నీవు తొడుక్కునే బూట్లు, నీవు పుస్తకాలు దాచుకొనే తోలు సంచి, తోలుపెట్టెలు శుభ్రంగా వాసన వేయకుండా వుంటున్నది వీటివల్లనే. ఇవి చర్మంలోని కొవ్వు, నూనె తీసి దాన్ని శుభ్రపరుస్తాయి. కల్లు, సారాయి, పొగాకు మొదలైన పదార్థాలన్నింటినీ ఇవే తయారుచేస్తున్నాయి.''

''మనకెంత ఉపకారం చేస్తున్నాయి అన్నయ్యా! అంతచిన్నవైనాను.''

''కాదమ్మా మరీ, చిన్నవాళ్లు పెద్దవాళ్లకు సహాయం చేయలేరనుకోకూడదు యెప్పుడూను. నీకు వుపకారం చేసేవాళ్లను నీ స్నేహితులుగా భావించవూ?''

''వాటికి మనమెంత ఋణపడి వున్నాం!''

''అవును సత్యా, మన కృతజ్ఞతావందనాలైనా అర్పిద్దాం.''

''మన కబుర్లు చాల్లే చెల్లీ నాకు వేళైంది కాలేజీకి.''

బామ్ ! బామ్ !! బామ్ !!!

"జై హింద్" బామ్

JAI HIND BALM

బామ్ అంటే భయపడకండి — ఇది బాంబుకాదు.

ఈ బామ్ మనకి మేలుచేసే బామ్. తలనొప్పి, గుండెజలుబు, రొంప భారం, గొంతునొప్పి, ఇంకా, మీకు ఆటలలో కలిగే గాయములను, బాధలను పోగొట్టుటలో యాటంబాంబులాగ పనిచేస్తుంది.

జై హింద్ అండ్ కో

వారిచే తయారు చేయబడినది—మద్రాసు 1.

# ఊతపదాలు

[మన తెలుగు భాషలో రోజూ మనం మాట్లాడుకొనే మాటల్లో ఎన్నో ఊతపదాలు ఉపయోగిస్తాం. ఊతపదాలు వాడితే మాటలు వినడానికిఎంతో ఇంపుగా వుంటాయి. మచ్చుకి కొన్ని ఊతపదాలు]

పెట్టే - బేడా; మూటా - ముల్లే;
పురుగూ - పుట్రా; దానం - ధర్మం;
భయం - భక్తి; కష్టా - కంపా;
చెట్టూ - చామా; ఇల్లూ - వాకిలీ.

ఇటువంటివి ఇంకా ఎన్ని తయారు చేయగలరు?

సంపాదన: శ్రీపాద సుబ్రహ్మణ్యం, 6-వ ఫారం, (విజయనగరం)

---

## ఈ ఉత్తరం గిత్తరం చదవండి


ఉంగుటూరు, గింగుటూరు ఫిబ్రవరీ, గిబ్రవరీ తేదీగిదీ పది.

బాలా!

ఉదయమే గిదయమే లేచి, ముఖం గిఖం కడిగి, స్నానం గీనం చేసి, తలాగిలా దువ్వుకొని, బొట్టూ గిట్టూ, కాటుకా గీటుకా పెట్టుకొని, బట్టా గిట్టా కట్టి, అన్నం గిన్నం తిని, పలకా గిలకా పుస్తకం గిస్తకం పట్టుకొని, బడికీ గిడికీ వెళ్లి, పాఠం గీఠం చదివి, విద్యా గిద్యా నేర్చుకొని, గంటా గింటా కొట్టగానే తిన్నగా గిన్నగా ఇంటికీ గింటికీ వస్తావుకాదూ?

ఇట్లూ గిట్లూ,

గుడివాడ గిడివాడ వెంకట గింకట సుబ్బారావు గిబ్బారావు.




కా న న్ ష్మి డ్ కు
వేలూరి శివరామశాస్త్రి
అ ను స ర ణం

# వేరు

దాలి, పోలి అనేవాండ్లు ఇద్దరు బస్తీనుంచి రెండు పండ్ల బుట్టలు మోసుకొని వస్తున్నారు. బరువు నెత్తిమీద ఎత్తుకొన్నది మొదలుకొనీ దాలి-'అబ్బ! ఎంత బరువుగాఉంది! ఇంతకంటె రాళ్లయినా తేలిక' అని విసుకు కుంటూ నడుస్తున్నది! పోలి నవ్వుతూ పేలుతూ కులాసాగా నడుస్తున్నది.

'నాబుట్ట యెంతబరువో నీ బుట్టా అంతే బరువు! పోనీ నాకంటె నీవు బలమైన దానవా అంటే అదీ కనబడదు! నీకెట్లా వస్తూన్నది అంత కులాసా?' అని దాలి అడిగింది.

'నేను నా బరువుమీద చిత్ర మైన ఒకవేరు పెట్టుకున్నాను! అందువల్ల నాబుట్ట తేలిక' అని పోలి అన్నది. 'వింతగా ఉందే! నాకుకూడా కొంచెం బరువు తగ్గిస్తూ; నీకు పున్నె ముంటుంది. నీకాలు మొక్కుతా; ఆ వేరు పేరు చెప్పు' అని దాలి బతిమా లింది.

ఇల్లా దాలి తనను బతిమా లంగా బతిమాలంగా- 'చూచావా అది చాలా వింతైనవేరు. బరు వంతా తగ్గించే ఆ వేరు పేరేమి టంటే 'ఓర్పు'. దాలీ! గుర్తు పెట్టుకో—

ఓర్పున్నచో నెంతయున్నను బరువు
మురువుతోదానిని మోయంగఁదెరువు

# పెండలం

ఒక పేదకాపు పెండలం వేసి, ఎరువుచల్లి, నీరుకట్టి, కలుపుతీసి బాగా పెంచాడు. ఒక దుంప ఏనుగు తలకాయంత ఊరింది. దాన్ని చూచి అందరూ వింత పడ్డారు! 'దీనిని తీసుకుపోయి రాజుగారికి బహుమతి చేయాలి' అని అతడు అనుకొన్నాడు.

ఆ మరునాడే అతడు దానిని దివాణంలోకి తీసుకొని వెళ్లాడు. రాజుగారు ఆ పెండలపు ఏనుగునుచూచి అతనికష్టం మెచ్చుకొని, వినయానికి సంతోషించి మూడు కాసులు కానుక యిచ్చాడు.

ఆకాపు ఇంటిపక్క మరో కాపు ఈ సంగతి విన్నాడు. వాడికి ఆశ పుట్టింది! 'నేను నాదూడను బహుమతీ చేస్తాను! ముష్టి పెండలానికే మూడుకాసులిస్తే నాదూడ కెంత యివ్వాలో' అని లోలోపల పాలుతాగుతూ దానికి పలుపుపెట్టి నగరులోకి తీసుకొని వెళ్లాడు!

రాజుగారి దర్శనం చేసుకొని 'ఈ దూడను తమకు కానుక పెటుతున్నాను; దయ ఉంచి ఏలినవారు తీసుకోవాలె' అని మనవి చేసుకున్నాడు.

ఆ రాజుగారికి ఆకాపు ఉద్దేశం తెలిసింది! వెంటనే 'నాకు అక్కరలేదు' అని అనేశాడు.

ఆకాపు - 'అయ్యా! నా కానుక చాలా కొద్దిది ఐనప్పటికీ దేవరవారు దయవుంచి తీసుకోవాలి' అని పట్టుపట్టాడు. చాలా తెలివి కల ఆ రాజు—'పాపం! నీవింత మంకుపట్టు పట్టుతున్నావు కాబట్టి పుచ్చుకుంటున్నాను. నీవు నామీద గౌరవానికే యీ కానుక యిచ్చావు కాబట్టి నేనుకూడా నిన్ను ఊరకే పంపించరాదు! నీ దూడకు ఇబ్బడి బహుమతి ఒకటి యిస్తాన' ని ఆ పెండలపు ఏనుగును ఇచ్చాడు.

సద్ బుద్ధికినిగాన్క సరిగా(గవచ్చు
దుర్ బుద్ధికినినెందు దొరకదుమెచ్చు.

# తోట

గంటయ్య తన తోటలో నూతి కింద కూరగాయలు పెట్టాడు. వంగలు అనపెట్టినై. బీరలు పొడుగు సాగినై. బెండలు ఎదిగినై. దోసలు పూత యెత్తినై.

అతడు తనకొడుకు రమణయ్యను పిలిచి—నేను ఊరికి వెళ్లి పదినాళ్లలో వస్తాను, కలుపు మహా మొలిచింది. నేను వచ్చేసరికీ ఒక్క కలుపుమొక్క ఉండరాదు, పీకివేసి గొప్పు తవ్వు' అని చెప్పి వెళిపోయాడు.

'రేపు పీకుతాలే, రేపు పీకుతాలే' అని అనుకుంటూ రమణయ్య బద్ధకించాడు. గంటయ్య పొరుగూరినుంచి తిరిగివస్తూ దారితల ఉన్న తోటలోకి వెళ్లి చూచాడు. గడ్డీ గాదమూ పెరిగి మెలివేసికొని అసలు మొక్కలు కనబడలేదు.

గంటయ్య గబగబా యింటికి వెళ్లి రమణయ్యను తోటలోకి తీసుకొనివచ్చి చూడమన్నాడు. రమణయ్యకు పరితాపంకలిగింది. అపుడు గంటయ్య- 'ఇప్పుడైనా చెడిపోదు. వెంటనే కలుపు తీస్తే పాదులన్నీ పనికివస్తవి. ఇంకో రోజూరుకుంటే మనచేయిదాటుతుంది. ఈ కలుపులో ఎన్ని పురుగులూ, పురుగులగుడ్లూ ఉన్నవో చూడు' అని చూపాడు.

చెప్పిన నాడే చేస్తే కలుపు సులభంగా పోయేది. పదిరోజులుగా పెరగడంవల్ల రమణయ్య వారం రోజులు కష్టపడవలసి వచ్చింది.

పని తటిలోఁ జేయవలెఁ గానిచోను
గోళ్లతో నగు పని గొడ్డళ్ల కాను.

**తెలుసా**

రష్యా నాయకుడు స్టాలిన్‌కు, ఢిల్లీనుండి ఒక బియ్యపు గింజ మీద ఇంగ్లీషులో అక్షరాలు చెక్కిన ఉత్తరం బహుమానంగా పంపబడింది. ఆ వుత్తరంలో 342 అక్షరాలు ఉన్నాయి. ఆ అక్షరాలు భూతద్దంతో చూస్తేగాని కనబడవుట.

# బంగారుదుంప

త్రిమ్మయ్య, తిమ్మయ్య అనే వాళ్లిద్దరు భద్రాద్రి పోతూ దారిలో ఒక తోట కనబడగా చూదామని అందులోకి వెళ్లారు. అక్కడ బంగారుదుంపలు బాగా ఊరినవి. వాటినిచూసి తమ్మయ్య--'ఆహాహా ఎంతలేసి ఊరినవో! ఒకొక్కదుంప ఒకొక్క వీసెడు ఉండవచ్చు' అని అన్నాడు.

తిమ్మయ్య బడాయికోరు, 'నేను మొన్న శ్రీశైలం వెళుతూ దారిలో ఒక తోట చూచాను. అందులో ఒకొక్క దుంప,—మా యింట్లో గది చూచావుగా—ఆ గదంత ఊరింది' అని దానిని గురించి యింకేమేమో చెప్పబోతున్నాడు.

'చాలుచాలు; ఇక ఆట్టే చెప్పనక్కరలేదు. ఆ నడుమ ఆ యూరివారు నాచేత ఒక హండీ చేయించారు. అది ఎంత దనుకొన్నావ్ 'మీ యిల్లంత' అని తమ్మయ్య అన్నాడు.

'ఆ? నీదంతా ఆశ్చర్యం! హండీ యేమిటి; ఇల్లంతేమిటి? దానితో ఏమి చేసుకుంటారు? ఇది అసత్యం' అని తిమ్మయ్య అన్నాడు.

'నిజమయ్యా నిజం! నీవు చెప్పిన బంగారుదుంపలు వండద్దూ? అందుకోసం.' అని తమ్మయ్య అన్నాడు.

తిమ్మయ్య సిగ్గుపడ్డాడు. 'అయ్యా నీ ఉద్దేశం తెలిసింది. నీవు ఎప్పుడూ నిక్కమే మాట్లాడతావు. నా అబద్ధాన్ని ఎత్తిపొడవడానికి నీ విల్లా అన్నావు. నేను ఇకనుండీ కోతలు కొయ్యను, బుద్ధి వచ్చింది' అని క్షమాపణ చెప్పుకున్నాడు.

గరువంపు నుడులతో ఘనులగువారు
ఏల చివాట్లతో హీనులు కారు?





రచన : డి. అమృతమ్మ

5 వ తరగతి (తలికిరి)


ఏమర్రా! మీకు ఏమీ తోచకపోతే ఈ ఆట చెప్తాను. దీనిని గాలిగుమ్మటాలాట అంటారు.

ఈ ఆటకి కావలసిన వస్తువులు మూడు :


1. నలుచదరపు గుడ్డముక్క; 2. నాలుగు సరిసమానమైనదారాలు; 3. చిన్నరాయి ముక్క.



మొదట ఈ బొమ్మలో వుండే లాగ ఒక గుడ్డముక్కను తెండి. తరువాత ఈ గుడ్డకు నాలుగు కొనలను నాలుగు చెరిసమానమైన దారాలు, ఈ బొమ్మలోలాగ కట్టాలి.



ఆ తరువాత ఆ నాలుగు దారాలు చేర్చి, వాటికొనను ఒక చిన్న రాయి ముక్కను కట్టాలి.



ఆలాగ కట్టితే, ఇదుగో యీ బొమ్మలో లాగ గాలిగుమ్మటం తయారవుతుంది.

ఈ గాలిగుమ్మటాన్ని, గాలిలో మీదికి తిన్నగా ఎగురవేస్తే, అది ఒక గొడుగు లాగ విప్పుకొని, ఆకాశంమించి మెల్లగా కిందకు పడుతుంది. రాయికి బదులు చిన్న చందనపు బొమ్మ కడ్తే, మరీ గమ్మత్తుగా వుంటుంది.



క్రిందటి యుద్ధంలో ఏం జరిగిందో తెలుసా? ఆకాశంలో విమానాలమీద సిపాయిలు వెళ్లి, విమానం ఆకాశంమీద వుండగానే, అందులోంచి పైకి ఉరికి గాలిగుమ్మటాలమీద క్రిందకు అపాయంలేకుండా దిగేవారు!

ఈ ఆట ఇంట్లో గదుల్లో ఆడకూడదు.

బాల

సం॥ చందా రూ 5/-

(ప్రత్యేక సంచికతో సహా)

వీ. పి. పద్ధతి లేదు.

## సమ్మోహనకరమైన

# చీరెలు

అంచుల కనువైన చీరెల రంగులూ, హృదయరంజక మైన డిజైన్లూ, తృప్తికరమైన పేటర్న్లు, కలిగి వున్నవి. చీరె లీనాడు సినిమా తారల పేర్లతోటీ, సినిమా చిత్రాల పేర్లతోటీ వెలువడుతున్నవి. త్యాగ భూమి చీరెలు, మంగమ్మ చీరెలూ, శివకవి చీరెలూ, అపరంజి చీరెలూ కొనే మహిళలకు, సినిమా తారలకూ, ఖ్యాతీ, కాలానుగుణ్యమైన ఫ్యాషనులూ సృష్టించేది మద్రాసు చేనేత వీవర్ల ప్రావీణ్యతేనని తెలియదు.

ఈ ప్రావీణ్యతవల్లనే మద్రాసు చేనేత వీవర్సు కోఆపరేటివ్ సొసైటీవారు నిత్యమూ కొత్తఫ్యాషన్ లలో సృష్టించ గలుగుతున్నారు. అందంలో నైతేనేమి, వుపయోగములో నైతేనేమి, ఇవి మిల్లు చీరెల కన్న ఎంతో వుత్కృష్ఠమైనవి.

**మద్రాస్ కో ఆపరేటివ్ చేనేత గుడ్డలు**

**నిర్ణయ ధరలకు తాజాసరకు**

---

## మద్రాసు హ్యాండ్ లూమ్ వీవర్స్
## ప్రావిన్షియల్ కో ఆపరేటివ్ సొసైటీ లి.

**నెం. 6-ఎ. వుడ్సురోడ్ - మౌంటురోడ్, మదరాసు.**



# పిచుక-రాజు



♦ ♦ ♦ రచన: పేర్రాజు ♦ ♦ ♦

అనగనగా ఒకవూళ్లో ఒక మంచి బంగారపు పిచుకుండిట. ఆ పిచుక ఒకరోజున ఒక జామిచెట్టుమీద కూర్చోని తోక ఆడించుకుంటూ ఒక్కొక్క జామిపండే తింటోంది. ఆవూరు రాజుగారు అలా వెడుతూ ఆ చెట్టుకింద నుంచున్నాడు. ఇంతలోకీ ఆపిచుక జామిపండు కొరికి ఉమ్మేసిన గింజలు రాజుగారి నెత్తిమీద పడ్డాయి.


ఏమిట్రా! అని పైకిచూసేసరికి పిచుక కనిపించింది. ఆ రాజుకి ఎక్కడలేనికోపమువచ్చి: ఒరేయి! పట్టుకోండిరా దాన్ని అన్నాడు.

సరే, నలుగురు నౌకర్లూ గబగబా చెట్టెక్కి పిచుకని పట్టుకు తీసుకొచ్చారు. అలా వెడుతుంటే ఒకతాత దడి అల్లుకుంటుంటే, ఈ పిచుకని ఆ దడిలో పెట్టి అల్లమని రాజు ఆజ్ఞాపించాడు. ఆ తాత దడిలో తాటాకులతోపాటు పిచుకనికూడా పెట్టి అల్లేశాడు.




అప్పుడు రాజువచ్చి 'ఏం పిచుకా బుద్ధొచ్చిందా?' అన్నాడు. 'అబ్బే తాతతో దడినేస్తున్నాను రాజా!' అంది పిచుక.

నీపని అలావుందా అని ఒక ముసలమ్మ మంచం నేసుకుంటోంటే ఈ పిచుకని అందులో పెట్టి అల్లెయ్యమన్నాడు. ఆ ముసలమ్మ నవారుతోపాటు పిచుకనుకూడా అల్లేసింది.



'ఏం ఇప్పు డెలా వున్నావు' అన్నాడు రాజు. "తాతతో దడి నేశాను. అవ్వతో మంచం నేస్తున్నాను!" అంది పిచుక.

రాజుకి మరింత కోపం వచ్చి ఒకచాకలి బట్టలు ఉతుకుతోంటే వాడి చేతికిచ్చి ఆ రాతిమీద పెట్టి దీన్నికూడా ఉతికెయ్యమన్నాడు. చాకలి అమ్మో! అయ్యో అంటూ ఉతికాడు.



"ఏం పిచుకా ఇప్పటికేనా బుద్ధి వొచ్చిందా?" అన్నాడు రాజు.

"ఓ రాజా? తాతతో దడి కట్టాను, అవ్వతో మంచం నేశాను, చాకలితో బట్టలు ఉతుకుతున్నాను' అంది పిచుక.

ఇంక దీనిపని ఇలాక్కాదని రాజు ఏంచేశాడంటే ఆ పిచుకని తన ఇంటికి తీసుకెళ్లి వొంటవాడి చేతికిచ్చి, 'దీన్ని కూర వొండి నాకు వొడ్డించు' అన్నాడు.

సరేనని వాడు తీసుకెళ్ళి ఓ బుట్టకింద పెట్టి కత్తిపీట కోసం వెళ్లాడు. పిచికేంచేసిందీ, ఇదే సమయం అనుకుని ఆ బుట్టకింద నుంచి తుర్రుమని ఎగిరిపోయింది. వంటవాడు వచ్చి చూస్తే ఎక్కడా లేదు. రాజుగారికి తెలుస్తే చంపేస్తాడని భయపడి ఒక పిల్లిపిల్లని వొండి అదే పిచుక అని చెప్పి వొడ్డించాడు. రాజుగారు, కులాసాగా భోజనం చేస్తూ, నవ్వుకుంటూ 'ఏం పిచుకా! ఇప్పటికేనా అణిగిందా నీ పొగరూ?' అన్నాడు. ఎదురుగుండా ఉన్న కిటికీలో నుంచి 'కుంటి పిల్లిని తింటున్న

రాజా! కులాసాగా వున్నావా?' అంది పిచుక.



రాజు తెల్లబోయి చూశాడు.

ఆ పిచుకని చూసేసరికి ఎక్కడ లేని కోపమూ వచ్చింది.

"తాతతో దడి కట్టాను, అవ్వతో మంచం నేశాను, చాకలితో బట్టలు ఉతికాను, వంటవాడితో వంట వొండాను. రాజుతో విందుకొచ్చాను వెర్రి రాజా!" అని పిచుక తుర్రున ఎగిరిపోయింది.


## రీటా తలవెండ్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును. సీసా 15అ.




**RITA**
**HAIR TONIC**

# ★ మన దేశంలోని జనాభా లెక్కపెట్టగలవా? ★

రవీంద్రనాథ ఠాగూరు చిన్నవాడుగా నున్నప్పుడు ఒక జర్మనుస్త్రీ వారి యింటికి వచ్చింది. ఆమె పిల్లలతో చాల చనువుగా, మాట్లాడుతూ యుండేది.

ఆమె ఠాగూరును, "మీ దేశపు జనాభా ఎంత? అని ప్రశ్న వేసింది.

రవీంద్రుడు తడవుకోకుండా 33 కోట్లు అని జవాబిచ్చాడు.

అప్పుడు ఆమె ఠాగూరు అన్నవైపు తిరిగి; "వరుసగా నీవు 33 కోట్లను లెక్క బెట్టగలవా?" అని ప్రశ్న వేసింది. "ఎందుకు లెక్కించలేను" అని అతడు గర్వంగా పలికాడు.

"ఎంత కాలము పడుతుంది" అని ఆమె అడిగింది. "కొన్ని గంటలు" అని ఠాగూరు సోదరుడు బదులు చెప్పాడు.

"కొన్ని గంటలా!" అని ఆమె ఆశ్చర్యకరంగా ప్రశ్నించింది.

"అవును కొన్ని గంటలలోనే" అని అతడు మళ్ళీ అన్నాడు. "అట్లయితే లెక్కబెట్టుమని" ఆమె ఆ కుఱ్ఱవానిని కోరింది.

అంతట ఆ బాలుడు ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు అని వరుసగా లెక్కబెట్ట మొదలెట్టాడు. రెండు నిముషాలలో 100 లెక్కపెట్టాడు.

"ఈ లెక్క ప్రకారం, 3,00,00,000 ను 100 చే భాగించి, 2 చే హెచ్చించి, 66,00,000 నిముషాలు పట్టుతుందని తెలుసా" అని ఆమె చెప్పింది. అంటే మన దేశ జనాభాను లెక్కబెట్టుటకే 12 సంవత్సరాల, 203 రోజుల, 8 గంటల కాలము పట్టుతుందని ఆమె ఆ బాలునకు చెప్పింది.

ఇది ఎప్పటి ముచ్చటో. ఇప్పుడు మన జనాభా 40 కోట్లు!

రచన: ఉదతా వెంకటేశ్వర్లు
(గుంటూరు)

# కన్నారా విన్నారా!

రచన : కె. సభా, [సేవాసమితి] దిగువమాఘం.

కాలేకడుపును
చేతపట్టుకుని
మాడేగుండెల
చిక్కబట్టుకొని
భగభగ యెండలో
ధుమధుమ ధూళిలో
ఎంగిలాకులకు
వెదకుచు తిరిగే
బాలల మీరు చూశారా ?
బాలల రోదన విన్నారా ?

★

చినిగిపోయిన
మలిన దుస్తులతో
చెదరిపోయిన
తలవెంట్రుకలతో
వీధిమూలలలో
చెట్ల నీడలో
పరుండు చుండే
బాలలు కలరే
ఆ బాలల మీరు చూశారా!
బాలల రోదన విన్నారా ?

★

పలకా బలపం
కొనుకోలేక
బడికెళ్లుటకు
బట్టలు లేక
చదువులన్నిటిని
చాలించుకుని
కూలిచేసుకుని
కాలముగడిపే
కూలి బాలలను చూశారా?
బాలల రోదన విన్నారా ?

★

పాలు లేని పసి
బాలల గోలలు
తిండి లేని పసి
పాపల అరపులు
బట్టలేని మన
బాలల బాధలు
కన్నారా ? విన్నారా ?






# ఆకాశసంగీతం

రచన: శిష్ట్లా ఉమామహేశ్వరరావు

ఆసామి కూతురికి అన్ని వేళలా పనిపాటలు చేస్తూండడం అసహ్యం వేసింది.

"ఆ! ఏమిటిదీ ప్రొద్దుడ్నుంచీ పొద్దాకా తీరకపోవడం." అనుకున్నది ఆసామి కూతురు.

వాళ్లకు పెద్దలోగిలుంది. గొడ్ల కొట్టాలున్నాయి. పొలముంది పోరంబోకుంది. కాని ఆ పిల్ల మనస్సులో సంతృప్తి లేదు.

"ఇక్కడుండను. ప్రపంచం చూడబోతాను!" అనుకున్నదా సామికూతురు.

అనుకున్నంతలోనే అడుగులు సాగాయి ఆ పిల్లకు.

ఇల్లు వదిలింది. వాకిలి వదిలింది. ఐనవాళ్లను వదిలింది. ఆంతర్యాలను వదిలింది - అడవిలోంచి పోతోంది ఆసామి కూతురు.

ఆ అడవిలోంచి పోయేదారి పేరు "ఎక్కడకు పడితే అక్కడకు". అదిచూచి "ఇన్నాళ్లూ ఎక్కడకో అక్కడకు పోయాను గాని ఎక్కడకు పడితే అక్కడకు పోలేదు. ఇదే మంచిది!" అనుకున్నదా అమాయక.

అడవి పిట్టలు కొమ్మలమీద నుంచి ఆసామి కూతుర్ని చూస్తూ కూశాయి. ఉడతలు ఇటూఅటూ ఉరుకెత్తుతూ ఉబలాట పడ్డాయి.

కుందేళ్లు కులికాయి. పిచ్చుకలు పిలిచాయి. అన్నీ ఆ పిల్ల నాల కిస్తూ ఆ పిల్లవైనం కనిపెడు తూన్నాయి. అన్నిటినీ చూచు కుంటూ అన్నిటినీ పలకరిస్తూ "ఎక్కడికి పడితే అక్కడికే" దారినే పయనమై పోయింది ఆసామి కూతురు.

ఆసామి కూతురు అడవి మధ్యకు చేరేసరికి ఆకాశం నుంచి సంగీతం వినవచ్చింది. "ఈ సంగీతం ఎవరిదో!" అని ఆ బాల అబ్బుర పోయింది.

"ఈ సంగీతం ఆకాశవాణి దనుకుంటాను, ఈ సంగీతం ఎటుతీసుకుపోతే అటే పోతాను" అనుకున్నది.

అనుకున్నట్లుగానే ఆ సంగీతం ఎటు వినవస్తే అటే పోయింది ఆసామి కూతురు. కొంతదూరం పోయింతర్వాత ఆమె అలిసి పోయింది. అందు కని ఓ చెట్టునీడన కూర్చుంది. అట్లాగే చేరగిలపడి నిద్ర పోయింది.

నిద్రలో కలగన్నది. ఓ మోతుబరి కుమారుడు ఆమె ప్రక్కనే కూర్చుని "అమ్మ పిల్లా, పనిపాటలు లేకుండా స్వేచ్ఛ కావాలని బయిల్దేరావా?. సరేపదా, నాకూ అదేకావాలి. ఇద్దరం కలిసి కనుక్కుందాం'' అన్నాడు. ఆ మాటలకామె త్రుళ్లిపడి లేచింది. కాని ఎవరూ కన్పించలేదు. అటూయిటూ పరు గెత్తి చూచింది. దాపునే ఓ గుట్ట చూచి దానిపై యెక్కిచూచింది. ఎవరూ కన్పడలేదు. అప్పుడే మళ్లా ఆ సంగీతం వినవచ్చింది.

"ఆ సంగీతం నన్ను పిలు స్తోంది. ఆ సంగీతం వెంటపోతే కలలో కన్పించిన కుమారుడగు పడతాడేమో!'' అనుకుంటూ ప్రయాణం సాగించిందాసామి కూతురు.

పోగాపోగా ఓవూరు చేరింది. ఆ వూరుచివర కొంతమంది గుమిగూడి గంద్రగోళ పడు తున్నారు. "ఏమిటదంతా?" అని ఓ మనిషి నడిగింది ఆసామి కూతురు.

"మావూరు మోతుబరి కుమారుడు కోడిపందాల్లో గెలిచాడు. అందుకని నలుగురూ సంతోషిస్తుంటే 'ఓష్, ఏమేటా యింతేనా? మనిషైనవాడు మహా ప్రపంచం చూచిరావాలి. ఇక్కడ స్వేచ్ఛలేదు. ప్రొద్దున్నుండి పొద్దాకా ఒకేరకం పన్లు!' అంటూ వెళ్ళిపోతున్నాడు. చుట్టాలు పక్కాలు చూస్తూ ఊరుకుంటారా? అడ్డం పోతున్నారు, అని ఆమనిషి చెప్పింది.

"ఓహో! ఓవేళ నేకలగన్న కుమారు డీతడేమో చూదాం!" అనుకుంటూ ముందరకు పోయింది ఆసామి కూతురు.

"అతడే! అతడే!" అని ఆ పడుచు గుర్తించింది కాని అతడుమాత్రం ఆమెను చూడకుండా నలుగురిలోంచీ తప్పించుకుని పరుగెత్తి పోయాడు.

"పోనీలే యేంచేస్తాం" అనుకుంటూ "ఓవేళ అడవిలో కనబడతాడేమో" అని మనస్సు కుదట చేసుకుని మళ్ళీ అడివి దారినే బయల్దేరింది ఆసామి కూతురు.

ఆమె ముందట మళ్ళీ ఆ ఆకాశ సంగీతం ధ్వనిస్తూ ముందుకు తీసుకు పోయింది.

కొద్ది దూరంలోనె అడివిలో ఓమూల ఓపూరిల్లు కనబడింది- ఆశతో అందులోకి పోయింది ఆసామి కూతురు. లోపల ఇద్దరు ముసలి దంపతు లుండగా చూచి తన కాకలి వేస్తున్నదని దీనంగా చెప్పింది.

ఆ దంపతులా పడుచును చూచి జాలిపడ్డారు. వాళ్ళ కున్న దాన్లో ఆ పిల్లకు కావలసినంత పెట్టారు. ఆసామి కూతురు కొన్నాళ్లక్కడే ఉండిపోయింది గాని కాలి తిమ్మరికి కందిమో ళ్లడమా అన్న సామితె సార్థకం చేసింది- మళ్ళీ ప్రయాణమైంది.

ఈ లోపున మోతుబరి కుమారుడుకూడా ఆ దిక్కునా యీ దిక్కునా తిరిగి యెక్కడా సంతోషంగాని స్వేచ్ఛగాని కనుపించకపోగా ఇంటిదారి పట్టాడు. అడివిన పడివస్తూ అలిసి ఓ చోట అతడు కూర్చుండగా ఆ

దారినే వస్తూన్న ఆసామి కూతురు ఆతన్ని చూచింది.

"అమ్మయ్య! కలలో మనిషి కనబడ్డాడు బాబూ!" అన్నది ఆసామి కూతురు.

"ఓహో! నువ్వూ నావల్లేనే పనిపాటలమీద విసుగువేసి వచ్చినట్లున్నావే?" అని ఆ కుమారుడడిగాడు.

"అవునుగాని అటుచూడు, ఆ సంగీతంవిను-మాటలుకూడా వినవస్తున్నవే!" అన్నదాసామి కూతురు.

ఇద్దరూ ఆసంగీతం విన్నారు. ఆ సంగీతం ద్వారా మాటాడేది ఆకాశవాణియని గ్రహించారు.

ఆకాశవాణి యిట్లని వాళ్ళిద్దరితో చెప్పింది; "ఓహో కుమారీ! ఓహో కుమారా! మీయిద్దరికీ స్వేచ్ఛ కావాలా? సంతోషం కావాలా? పనిపాటల్లో పాలుమాలితే యీరెండూ యెట్లా వస్తయర్రా? పిచ్చివాండ్లలారా. ప్రపంచమంతా తిరిగినా మీ వెతుకులాట వృథాయే!"

ఆ మాటలువిని వాళ్ళిద్దరూ విస్మయ పడ్డారు. తమ పొరపాటు గ్రహించు కున్నారు.

మోతుబరి కుమారుడూ ఆసామి కూతురు పెండ్లిచేసుకున్నారు. ఆకాశవాణి పలుకులు విన్న ఆచోటనే ఇల్లుకట్టుకుని కొత్త సంసారం ఆరంభించారు.

పనిపాటలలో ఒకరికొకరు తోడుగా ఉండడంచేత వారిద్దరికీ సంతోషమూ స్వేచ్ఛా కలిగింది!



కుళాయి దగ్గర గలాటలో నూ కుండలు విరిగెను చూడండోయ్!

# గొలుసు మాటలు

[ఈ గొలుసు మాటలో రంగులు దాగున్నాయి వెతకండి]

పూలోపూలు !

ఏమి పూలు ?

బంతి పూలు

ఏమి బంతి ?

పెరుగు బంతి

ఏమి పెరుగు?

ఆవు పెరుగు

ఏమి ఆవు ?

తెల్ల ఆవు

ఏమి తెల్ల ?

బట్ట తెల్ల

ఏమి బట్ట ?

నల్ల బట్ట

ఏమి నల్ల ?

బొగ్గు నల్ల

ఏమి బొగ్గు ?

మసి బొగ్గు

ఏమి మసి ?

కుండ మసి

ఏమి కుండ ?

పసుపు కుండ

ఏమి పసుపు ?

దుంప పసుపు

ఏమి దుంప ?

కంద దుంప

ఏమి కంద

నీటి కంద

ఏమి నీరు ?

రంగు నీరు

ఏమి రంగు ?

నీలి రంగు

ఏమి నీలము?

గాజు నీలము

ఏమి గాజు ?

పచ్చ గాజు

ఏమి పచ్చ ?

ఆకు పచ్చ

ఏమి ఆకు ?

జామ ఆకు

ఏమి జామ ?

ఎఱ్ఱ జామ

ఏమి ఎఱ్ఱ

నారింజ ఎఱ్ఱ

ఏమి నారింజ ?

తీపి నారింజ

ఏమి తీపి ?

పలుకు తీపి

ఏమి పలుకు

"బాల" పలుకు

రచన : ద్వారంపూడి పుత్సారెడ్డి.
(ఆ ర వ ల్లి.)

# డ

వాడలోకెల్ల అది

పెద్ద మేడ

మేడ నాల్గువైపుల

ప్రహరి గోడ

గోడ నలుగడల

సుమతరుల నీడ

నీడలో బాల బాలికల

క్రీడ

క్రీడ క్రీడకును

పూవు లల్లాడ

క్రీడ కాదు కాదది

స్వర్గజాడ

జాడయును కాదు

స్వర్గమే చూడ.

రచన : నాగవోలు వెంకటఅప్పారావు.
(పాలకొండ)

# లేవు

రాయికి రక్తము

నాలుకకు దుమ్ము

అరచేతికి రోమము

కోడికి పాలు

పాముకి కాళ్లు

లేవు

ఇలాంటివి ఇంకా తెలుసుకో

చాలా.

గుసిడి సూర్యనారాయణ
(అనకాపల్లి)

# సిరి చుక్క — దెబ్బ

రచయిత : భరద్వాజ

బడికి కుర్రాళ్లు ఆలశ్యంగా రాకుండా పెందలాడే వచ్చేందుకుగాను పూర్వం బడిపంతుళ్లు అంతా ఓచోట కలిసి ఆలోచించారు. వాళ్లల్లో ఓ పెద్దబుర్రకి వెంటనే సులువుగా ఓ ఉపాయం తట్టింది. కుర్రాళ్లల్లో పోటీలు పెడితే వాళ్లల్లో వాళ్లు పోటీలుపడి బడికి నేను ముందంటే నేను ముందని దూకుతారని. అందరూ ఈ యుక్తి చాలా బాగుందంటే చాలా బాగుందని తలలూపారు. ఇంకేం? రాజు తలిస్తే దెబ్బలకి కొదవా?

మర్నాడే పంతుళ్లు కుర్రాళ్లకి చెప్పారు. 'రేపటినుండి బడికి ఎవడైతే అందరికంటే ముందస్తుగా వస్తాడో వాడికి సిరిచుడతారని, రెండోవాడికి చుక్క పెడతారని, మూడోవాడినుంచి వరసగా దెబ్బలు ఒకడికంటే ఒకడికి హెచ్చుతూ పోతాయని. కుర్రాళ్లందరూ జాగ్రత్తగా పంతులు చెప్పిందాన్ని విన్నారు. రేపు నేను అందరికంటె ముందస్తుగావచ్చి సిరిచుట్టించుకుంటానని ఒక్కొక్కడూ తనలో తానే అనుకుని నిశ్చయించుకున్నాడు. పక్కవాడికి తెలిస్తే వాడు కాస్తా తనకంటే ముందస్తుగావచ్చి సిరి చుట్టించుకుంటే? అందుకని ఎవడికీ చెప్పకుండా తనలో తానే అనుకున్నాడు.

ఒక్కొక్కడూ ఇంటికివెళ్ళి రాత్రే వాళ్ల అమ్మమ్మ తోటి 'పంతులు సిరిచుడతా నన్నాడే. తెల్లారగట్టే లేపేం?' అన్నాడు. పొద్దున్నే, అమ్మమ్మ లేపితే, లేచి, పక్కింటి కుర్రాడు సిరి చుట్టించుకుంటాడేమో నని గబగబా ముఖం కడుక్కుని, అమ్మ దగ్గరికెళ్ళి తలదువ్వుకుని,

చుక్కబొట్టు పెట్టుకుని, వస్తరంలో పెద్దబాలశిక్షా, పలకా అదీ పెట్టి కట్టుకుని ప్రతికుర్రాడూ బడికి బయలుదేరాడు.

వీళ్ళందరూ వెళ్ళేసరికల్లా ఇద్దరు కుర్రాళ్లు ముందస్తిగావచ్చి నిలుచుని ఉన్నారు. పంతులు మొదటివాడి చేతిలో తన బెత్తం తోటి 'శ్రీ' అని రాశాడు. వాడు తక్కిన వాళ్ళందరికేసి తను చాలా గొప్పవాణ్ణి అన్నట్టుగా చూచాడు. తక్కిన కుర్రాళ్లు వాడికేసి పులుకు పులుకుమని చూచారు. ఇక రెండోవాడి చేతిలో పంతులు బెత్తంతోటే చుక్క పెట్టాడు. ఆతరవాత ఒకటి, రెండు, మూడు ఇలా వరసగా బెత్తంతోటి వడ్డించాడు. ప్రతివాడికీ మాత్రం సిరిచుట్టించుకోవాలనే ఆశపోలేదు. ఇవాళ పోతే పోయిందిలే. రేపు తప్పకుండా ముందస్తిగావచ్చి సిరి చుట్టించుకుంటానని ప్రతి కుర్రాడూ అనుకున్నాడు. ఆనాడు ప్రారంభించినపోటీ ఇప్పటికీ వీధి బడుల్లో అమల్లో ఉంటూఉంది. ఎందరో కుర్రాళ్లు సిరి చుట్టించుకుని, ఒక్కొక్కప్పుడు దెబ్బలు కూడా తిని, చదువుకుని, బడి వదలి పెద్దవాళ్లైనారు. వాళ్ళందరూ 'సిరి' ని మరచిపోతే పోవచ్చుగాని 'సిరి' ని మాత్రం యింకా పెద్దపెద్ద వాళ్ళను తయారు చేస్తూనేఉంది. బడి పంతుళ్లు మనయుక్తి బాగా పారిందనుకున్నారు. కుర్రాళ్లు ఇది చాలా బాగుంది అందరి కుర్రాళ్ళూ సిరి చుట్టించుకుంటే ఎంత ధీమాగా ఉంటుందని అనుకున్నారు. బాలా! నీవుకూడా సిరి చుట్టించుకుంటావా?



1947 పంచాంగము క్యాలండరు (గ్లేజుకాగితము) బహుమానము

(5–0–0 లు పంపి పుస్తకములు తెప్పించుకొనువారికి పోస్టేజి ఉచితము. మరియు దేశనాయకుల త్రివర్ణచిత్రముగల 1947 సం॥ పాకెట్ క్యాలండరు బహుమానము)

## రమ్యమైన రాయల ప్రచురణములు

(తెల్లని గ్లేజుకాగితమున, పెద్ద అక్షరములతో ముద్దులు మూటగట్టునట్లు ముద్రింపబడినవి)

| | | | |
|---|---|---|---|
| రామరామ శతకము | 0-2-0 | బాల రామాయణము | 0-2-0 |
| నారాయణ శతకము | 0-2-0 | సుమతి శతకము | 0-2-0 |
| కృష్ణ శతకము | 0-2-0 | గజేంద్ర మోక్షము | 0-4-0 |
| దాశరధి శతకము | 0-2-0 | రుక్మిణీ కల్యాణము | 0-4-0 |
| భాస్కర శతకము | 0-2-0 | నరసింహ శతకము | 0-4-0 |
| వేమన శతకము | 0-2-0 | అమరకోశము(ప్రకాండము) | 0-4-0 |

అనుభవజ్ఞులగు పండితులచే టీకాతాత్పర్యము వ్రాయబడినవి. ఆంధ్రదేశమునందన్ని ప్రాంతములలోను అందరిప్రజల ఆదరణపొందినవి. తెల్లని గ్లేజుకాగితమున అందమగు అచ్చులో తయారైనవి.


| | | | | | |
|---|---|---|---|---|---|
| సుమతిశతకము | టికా. తా. | 0- 4-0 | భాస్కరశతకము | టీకా. తా. | 0- 8-0 |
| కృష్ణశతకము | ,, | 0- 4-0 | గజేంద్ర మోక్షము | ,, | 0- 8-0 |
| బాల రామాయణము | ,, | 0- 4-0 | రుక్మిణీ కల్యాణము | ,, | 0- 8-0 |
| నీతిశాస్త్రము (పాకెట్ సైజు) | | 0- 4-0 | అమరకోశము | ,, | 0- 8-0 |
| దాశరధిశతకము | ,, | 0- 6-0 | నరసింహశతకము | ,, | 0- 8-0 |
| నీతిచంద్రిక (144 పుటలు) | | 0-10-0 | ఆంధ్రనామ సంగ్రహము | ,, | 0-10-0 |

మద్దులేటి నృసింహ శతకము (కందపద్యములు, పాకెట్ సైజు) 0- 2-0
గృహ సరస్వతి (10 దినములలో ఇంగ్లీషు అక్షరములు నేర్చుకొనుటకు) 0- 4-0
పుష్పగిరి మాహాత్మ్యము 0-4-0 రాయల గణితబోధిని 0- 1-0

బాలలకు బహుమంచి పుస్తకములు "రాయల ప్రచురణములు"
బాలలు చక్కగా చదువుటకు అనుకూలమైనవి "రాయల ప్రచురణములు"
బాలలు పుస్తకము లెచ్చట కొనినను "రాయల ప్రచురణముల" కొనుట మంచిది

... వివరములకు ...

## రాయలు అండు కో., పబ్లిషర్సు, కడప.



# బాలసేన పాటలు

బాలలమోయ్
బాలలము॥
భారతదేశపు
భాగ్యభూమిని
పుట్టిపెరిగెడి
బాలలము
బాలలమోయ్
బాలలము.
ఆనందముగా
ఆటపాటలతో
అమ్మానాన్నకు
ముద్దులుగొల్పే
బాలలమోయ్
బాలలము.
జాతిమతంబులు
మాటలుమరచి
తోడివారితో
జట్టుగవుండే
బాలలమోయ్
బాలలము.
పాఠశాలకు
ఎప్పుడువెడుతూ
విద్యాబుద్ధులు
శ్రద్ధగనేర్చే
బాలలమోయ్
బాలలము
పరదేశీయుల
చేతనువున్న
రత్నగర్భయగు
భారతమాత
బాధలుచూచి
సహించలేని
బాలలమోయ్
బాలలము.
బాలసేనలు
యుద్ధముచేసి
దానిసత్వము
పూర్తిగబాపి
స్వతంత్రభారత
రాజ్యముతెచ్చే
భారతదేశపు
వీరులమోయ్ వీరులము.
బాలలమోయ్ బాలలము.

రచన: బి. వి. వి. ఆర్. సుబ్బారావు,
(జాతీయ రచనామండలి) సీతానగరం.

# ★ జిలిబిలి పలుకుల బాల ★

పండితశ్రీ : బులుసు వేంకటేశ్వర్లు బి. ఏ.

జిలి బిలి పలుకుల నమృతము
చిలుకుచుఁ బలు విధము లైన చింతల వంతన్
గలఁగెడు పెద్దల మనముల
నలరించెడు "బాల" నీకు నాశీశ్శతముల్.

ఆవంత చింత యెఱుఁగవు
ఏవంతయు నీకుఁ గలుగ దెప్పుడు సుఖ దుః
ఖావళి నీకు సమానము
కావుననే యోగి నిన్నుఁగాఁ బోల్తు రిలన్.

"బాల వాక్కును మఱియును బ్రహ్మ వాక్కు"
తనర "బాలాదపి సుభాషిత" మ్మటంట
వేయి నోళ్లను దెలుపు నీ ప్రాయమందుఁ
గలుగు ఘనతను నిన్నెన్నఁగలమె! బాల!

ఇటు సూర్యుం డటు పొడిచిన
అటు చంద్రుం డిటుల నుదయ మైనను నీకే
యటమట కలుగదు గద నీ
పటు ధైర్యము నేర్పు మాకు బాలా! యింకన్.

కలిమి కలిమిని నిసుమంత గర్వపడవు
లేమిఁ గుందవు కాంక్షింప వేమి కాన
బాలయే బ్రహ్మమగు; పల్కులేల యింక
నిన్నుఁ జూచి సర్వము మేము నేర్వవలయు.

# నే ను

మహాప్రపంచంలో
భూగోళంలో
ఆసియా ఖండంలో
భారతదేశంలో
మదరాసురాష్ట్రంలో
ఆంధ్రదేశంలో
ఉత్తర విశాఖ
జిల్లాలో
శ్రీకాకుళం అను
గ్రామంలో
పేర్లవారి
వీధిలో
మా ఇంటిలో
నేను
ఉన్నాను.

నాపేరు : రవణ

(నాలుగేళ్లు)


## జాబ్‌కో వస్తువులు
అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి — సబ్బులు, నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్‌కోవారే తయారుచేస్తున్నారు. మీరు స్వదేశీవస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా? జాబ్‌కో మార్కుగల వస్తువులే, అన్నిటికంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీనే కొనుడు.

జాబ్‌కోనే కొనుడు.

మేము తయారుచేయు వస్తువులు:

హేర్ గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె, లైంగ్లిన్, హేర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

జయభారతం కంపెనీ
మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.

# డెబ్బదిగదులకోట!

ఈ పక్క పేజీలో డెబ్బదిగదులకోట వుంది. అన్ని గదులకూ తలుపులు వున్నాయి. కొన్ని గదుల తలుపులు తెరచి వున్నాయి, కొన్ని మూసివున్నాయి. కోటలో, మీదివరుస గదులు చూడు. అందులో ఒక గదిలో కూజావుంది. ఆ కూజాలో అమృతం వుంది. ఆ అమృతం తాగుతే నీకు జయము కలుగు తుంది.

అదుగో! తొందరపడకూ! ఆ గదిలోనికి నీవు వెళ్లాలంటే, కోటలో దిగువ వరుసలోవున్న మధ్యగదిలోనుంచి బయలుదేరాలి. తలుపు తెరిచివున్న గదులలోనుంచి వెళ్లి ఆ అమృతం త్రాగు. ఒకగది దాటినతరువాత తిరిగి ఆ గదిలోనికి రాకూడదు. మూసి వున్న తలుపులు తెరువకుండా, నీవు ఒకేసారివెళ్లి ఆ అమృత మును చేరగలవా?


భయపడకుము! ఊఁ....బయలుదేరు! నీకు జయము కలుగును.

యు. రామం, మదరాసు.

---

**తె లు సా**

ప్రపంచంయొక్క జనసంఖ్య,1940 లో 2,17,40,00,000
ప్రపంచంఅంతటిలోనూ ఇప్పుడుసుమారు7,00,00,000 సైకిళ్లు వున్నాయి.






రచయిత : కొండపల్లి వెంకటరామదాస్, తుని.

## 1-వ మజిలీ

అనగా అనగా, మంచి ముహూర్తం చూచుకొని, పేరితాతయ్య మనుమడు బాలయ్య పేరిగ్రామం నుంచి, మజిలీలు చేసుకుంటూ కాశీ బయలుదేరాడు. ముందఱ బాలయ్య బుజంమీద ఓమూట పెట్టుకుని నడుస్తూంటే వెనకాల తాతయ్య చేపాటికర్ర టిక్ టిక్ మని చప్పుడుచేస్తూ కిర్రుచెప్పుల్తో కిర్రుగా నడుస్తూన్నాడు. ఇలా నడవగా నడవగా వారికి ఓపెద్ద చెరువు త్రోవలో కనిపించింది. అదేంటో! తమాషా! ఆచెరువు గట్టు చుట్టూ దట్టంగా, ఎత్తుగా మామిడి, నేరేడు మొదలైన పళ్లనిచ్చే చెట్లు పెరిగివున్నై! వాటిమీద రకరకాల పక్షులు, ఆడ్తూ, పాడ్తూ, ఎగుర్తూవున్నై! ఈ తమాషా చూడంగానే మన బాలయ్యకు అడుగు ముందఱ పడితే వట్టు! ఊఁ! తాతయ్యా! ఈ తమాషా ఏంటో చెప్తేనేగాని కదలనంటూ మూట క్రిందదింపేసి చతికిలబడ్డాడు. సరే! నీతో రావటం బలే ముప్పుగావుందే! నడుస్తూ చెప్పుకుందాం, పదవోయ్! నాయనా! అన్నాడు తాతయ్య. చెపితేనేగాని కాలు కదపనన్నాడు బాలయ్య భీష్ముడులా. ఊఁ! అని తాతయ్య ఓపొడుంచితాలాగి కొంచెమాలోచించి ఇలా చెప్పడం మొదలెటితే, మన బాలయ్య శ్రద్ధగా వింటూన్నాడు!

### "పిట్టల చెరువు కథ"

అనగా అనగా రామాపట్నం. ఆ పట్నానికి, రాజుగారు, రామ

రాజు. తనప్రజల్ని కన్నబిడ్డల్లా
చూచుకుని పరిపాలిస్తూండేవాడు.
అతని పెళ్లాం రమాదేవి. భార్యా
భర్తలు చాలా అనుకూలంగా
వుండేవారు. అనుభవించటానికి
కావలసినన్ని సదుపాయాలు,
సౌఖ్యాలున్నా! కానీ వారి
కొక్కటే విచారం! పాపం పుట్టిన
సంతానం, నిలబడటంలేదు.
ఎన్నో వ్రతాలు, జపాలు, హో
మాలు చేశారు. లాభం లేక
పోయింది.

ఇలా వుంటూండంగా, ఒక
రోజున, ఆ రాజుగారి కోటలోకి
ఓసన్యాసివచ్చి జోశ్యం చెప్పేడట
ఇలా: ఓరాజా! నీకు సంతతి
నిల్వటానికి ఒక్కటే ఉపాయం!
చెప్తావిను! నే నిచ్చే ఓపసరు
నీ వంటినిండా పూసుకుని సరిగా
నీ రాజ్యానికి తూర్పు దిక్కుగా
పన్నెండామడల దూరందాకా
పోయ్యావంటే, నీకు వర్సగా,
చీమలపట్నం, పాముల పట్నం,
గరుడపట్నం తగుల్తై. నాయీ
పసరుశక్తివల్ల, చీమలు, పాములు,
గరుడులు, నిన్నేం చేయలేవు.
అలా ఆఖరునచేరిన గరుడపట్నం
లో, గరుడకోటలో, గరుడరాజు
వుంటాడు. ఆతన్ని ప్రార్థించు.
లాభముంటుంది అని ఓపసరు
రాజుగారికిచ్చి వెళ్ళేడా సన్యాసి.

సరేనయ్యా! సన్యాసి సలహా
ప్రకారంగా, మంచిరోజు చూచు
కుని, మన రాజుగారు తూర్పు
దిక్కుగా బయలుదేరారు, పసరు
వంటినిండా పూసుకుని. బాల
య్యా! అలా బయల్దేరి, గుట్టలు,
నదులు, అడవులుదాటి, పన్నెం
డామడల దూరందాకా నడచి,
వర్సగా చీమలపట్నం దాటి,
పాములపట్నం చేరుకుని, అది
కూడా దాటి గరుడపట్నం చేరు
కున్నాడు. వాకబులమీద, గరుడ
రాజుగారికోట ఎక్కడో తెల్సు
కున్నాడు. ఆ గరుడకోటచుట్టూ
పహరా సిపాయీలు కాపలా
కాస్తూన్నారు. వారికి తను తెచ్చిన
బహుమతులలో కొన్ని సమ
ర్పించి, లోపల చొరబడ్డాడు.
అలా! ఏడుసింహద్వారాలుదాటి,
రాజుగారి అంతఃపురం చేరు
కున్నాడు. మెల్లగా గరుడరాజు

సభలోవున్న సమయం కనిపెట్టి, తను తెచ్చిన బహుమానాలు, గరుడరాజుగారికి సమర్పించి, నమస్కరించి నిలబడ్డాడు రామరాజు.


అప్పుడా గరుడరాజు ఏంచేశాడయ్యా అంటే రామరాజు ఇచ్చిన బహుమానాలన్నింటినీ, నేలకి విసరికొట్టి, ఏడిశావ్! నీమొహానికి బహుమతులుకూడాను. నిన్ను చూస్తేనే పాపం అంటుకుంటుంది పో, పో, అన్నాడు కోపంగా.

గడగడవణకుతూ, మన రామరాజు, మహారాజా! నే నెరుగుండి ఏపాపం చెయ్యలేదింతవరకు. నావల్లజరిగిన పొరపాటేదో చెప్పు. దిద్దుకుంటాను అన్నాడు. దాంతో, గరుడరాజు మరింత మండిపడి, సరే! నంగనాచీ! వినవోయ్! నీ రాజ్యంలో తిన తిండిలేక, త్రాగేనీరు లేక, ఉండ ఇళ్లులేక, అన్యాయంగా అనేకములైన మా పక్షుల సంతతులు చచ్చిపోతూంటే, నీవు నాకేమని రాజసౌఖ్యాలవీ అనుభవిస్తూ కూర్చు



న్నావ్! వాటి ఉసురు తగుల్తూంటే, నీకు సంతతి ఎట్లా నిలుస్తుంది, అనుభవించూ! అన్నాడు. అల్లాగయితే, నాయీ పాపంపోవటం ఎట్లాగోకూడా చెప్పి శాస్త పుణ్యం కట్టుకోవయ్యా గరుడరాజా! నీమేలెన్నటికి మరచిపోను అని కాళ్లావేళ్లా బ్రతిమాలాడు రామరాజు. రామరాజు ప్రార్థనలతో గరుడరాజు శాస్త తమాయించుకొని ఇలాచెప్పేడు!— ఊఁ సరే! విను. వెంటనే నీ రాజ్యానికిపోయి, నీ రాజ్యానికి తూర్పుదిక్కులో ఓపెద్ద చెరువు త్రవ్వించి, చుట్టూ ఎత్తుగ గట్టు పోయించి, దానిమీద మంచి, ఫలవృక్షాలు పెంచు. అప్పుడు మళ్లా, చెదరిపోయిన మా పక్షి సంతతులు తిరిగీ అక్కడచేరుకుని, హాయిగా జీవిస్తాయి. నీ పాపం, ఈ విధంగా పటాపంచలై, నీ సంతానం నిలుస్తుంది. వెళ్లు. ఆలశ్యంచేయకు. మరిన్నీ! ఈ విషయం మరచిపోకు, ఆ చెరువులోనీరు, నీవుగాని, నీరాజ్యంలో మనుష్యులుగాని ఉపయోగించుకొన్నారంటే, మళ్లా నీసంతానం మాయ మవుతుంది. ఈ సంగతి నీ వంశంవాళ్లందఱూ మరవకూడదు సుమా!

ఇహ! మన రామరాజు, నాలుగంచీల్లో, తనరాజ్యం చేరుకుని, వేలకొలది కూలీలద్వారా, గరుడరాజు చెప్పినట్లు చేయించాడు. క్రమేపీ, వృక్షాలు పెరిగినై. వాటిమీద పక్షులన్నీ మళ్లా విడిసినై. ఈ విధంగా, రాజుగారికి, పాపం పటాపంచలై, చక్కని కొడుకుపుట్టాడు. రామరాజు స్వయంగా ఎన్నో కానుకలు గరుడరాజు కిచ్చివచ్చేడు. తన వంశంవాళ్లెవరూకూడా ఆ చెరువు నుపయోగించుకొనరాదనీ, తన రాజ్యంలో ఎవరైనా ఆ నీరుపయోగించినట్లు తెలిస్తే మరణదండన అని శాసించాడు. ఇదీ కథ! బాలయ్యా! దీనినే పిట్టల చెరువంటారు! అన్నాడు కథ ముగించిన తాతయ్య. బలే! తమాషా! తాతయ్యా! పిట్టలకు చెరువు! అంటూ మూటపట్టుకుని, తాతయ్యను వెనకాల నడిపించుకొంటూ రెండో మజిలీ చేరుకోడానికి నడుస్తూన్నాడు మన బాలయ్య!



# రావమ్మ కోకిలా!

"నైవేద్యం" నుండి

సంపాదన: చె. శ్రీ. వెంకటరామయ్య

రావమ్మ కోకిలా!
రావమ్మ కోకిలా!
అల్లదే మాదొడ్లొ
అంటుమామిడి గున్న.
కలదు మాచెట్లోన
కమ్మని చిగురు;
కడుపునిండా తిని
కదలి పోవచ్చు.
"కూవూ" అనునీదు
కూత విన్నంత
పాపాయి నీలాగె
పాడసాగింది.
నీతోను సమముగా
నిన్నటి బాల
ఆలపింపగలేదు
అలక చెందకుము
వచ్చి వచ్చీ పాడి
వల్లె వేయించి
పాటలు నేర్పుమా
పాప కనుదినము.

## గొఱ్ఱె - బండీ

నేను ఒకజంతువను. గొఱ్ఱెను కాను. నేను బండీని లాగను. కాని నేను గొఱ్ఱెలోనూ, బండీలోనూ వున్నాను. నే నెవరు?

జవాబు ఏప్రిల్ సంచికలో చూడండి.

—నిర్మలమ్మాయి,
(అనంతపురం)


## త

ఈ అక్షరములో ఒక అమ్మాయిపేరు దాగివుంది. అది మూడు అక్షరాల పేరు. ఆ పేరేదో చెప్పగలరా?

జవాబు ఏప్రిల్ సంచికలో చూడండి.

—కె. వి. హనుమాన్; సి. నాగరాజు.
(అనంతపురం)


## ★ వింత పెట్టెలు ★



ఈ పై బొమ్మలో అట్టపెట్టెలు మూడు వున్నాయి. బాగా చూడండి. అందులో నల్లరంగు మూతలుగల పెట్టెలు రెండిటిమీద ఒకపెట్టె వున్నదా?—లేక నల్లరంగు మట్టములుగల పెట్టెలు ఒకదానిమీద రెండు పెట్టబడివున్నవా?

సంపాదన: పి. సుబ్బారాయుడు (మెడికో)
విశాఖపట్టణం.

# నవాబుగారి పెళ్ళి



అనగా అనగా ఓ నవాబుగారు ఉండేవారుట. ఆయనేమో బలే గొప్ప వారు. చాలా మంచివారు కూడా. ఆయనమీసం ఎంత పెద్ద దనుకున్నావేమిటి? అసలు నవాబుగారు చాలా పొడుగుపాటి మనిషి కాబట్టి సరిపోయింది కాని, నీలాంటివాళ్ళు నాలాంటివాళ్లయితే అదికాస్తా కాళ్ళకింద బంధాలు పడేదేమో కూడాను! అది రోజూ చక్కగా సెంటురాపి దువ్వించేవాడుట - మీసాలు కూడా దువ్వుకుంటారు తెలుసా - మరీ పొడుగ్గా ఉంటే.

ఆ ఊరికి దగ్గరగా అడవుల్లోనే దొంగలే దొంగలు; వందలకి వందలు! వాళ్ళపని ఈ నవాబుగారి రాజ్యంమీదపడి అందర్నీ తన్ని డబ్బు ఎత్తుకుపోతూ ఉండటం. సరీగా ఒళ్ళు ఒంచి పనిచేయడమంటే ఒక్కడికీ పడదు. ఒట్టి సోమరిపోతులు. వీళ్ళకి నవాబుగారంటే మంట. బోలెడన్ని మాట్లు దొంగతనం

చేయడానికివెళ్తే ఆయన సైని కులు తరిమేశారు. ఓమాటు పెద్ద గుంపుగావెళ్ళి ఓఊరు దోచు కుంటుంటే నవాబుగారు ఒచ్చి ఒంటిచేత్తో వీళ్ళందర్నీ తన్ని తరిమేశారు. ఆరోజున వాళ్ళ నాయకుడు - వాడసలు రాక్షసుడల్లే ఉంటాడు - వెళ్ళి ఆయనతో కలపడేటప్పటికి ఆ నాయకుడి పనికాస్తా చితకా మతకా అయిపోయింది. అసలు నవాబుగారికి బంట్రోతులు వెంటలేక పోయారు కాని లేకపోతే అప్పుడే వీళ్ళందరూ జైల్లో పడిపోయేవాళ్ళే. అప్పట్నుంచి నవాబుగారిని ఎల్లాగైనా పట్టుకోవాలని దొంగలు తిప్పలు పడ్డం మొదలెట్టేరు. ఓమాటు ఆయనవేటకెళ్తుంటే వీళ్ళందరూ పోయి ఆయనమీద పడ్డారు. అప్పుడు పారిపోడానికి బదులు ఆయన తను ఎక్కిన ఏనుగుని తిన్నగా వీళ్ళమీదికి తోలేటప్పటికి, దొంగలందరూ 'పోలో' మని ఒకటే పారిపోడం. పైగా కొండల్లోకి వెళ్ళింతరువాత "నువ్వు పిరికి వెధవ్వి" అంటే "నువ్వు పిరికి వెధవ్వి", "నువ్వుముందు పారిపోయా"వంటే 'నువ్వుముందు' అని సిగ్గులేకుండా దెబ్బలాడుకోడం.

రచన : ఇంద్రదేవ్ శ్రీరామమూర్తి, ఎం.ఏ. (మదరాసు)

ఇల్లా ఉంటూ ఉండగా నవాబుగారిపెళ్ళి దగ్గరకొచ్చిందిట. ఈయన రాజ్యానికి పక్కనే ఓగొప్ప సుల్తాన్ గారు ఉన్నారు. ఆయన కూతురు చక్కని చుక్క. ఆ అమ్మాయి నవాబుగారి మీసం సంగతి విందట. ఇంక అప్పట్నుంచి "ఈ నవాబునితప్ప ఇంకెవరినీ పెళ్ళాడనని" కూర్చుందిట. వాళ్ళనాన్నగారు - అంటే సుల్తాను అన్నమాట - కూడా ఈ మాట విని చాలా సంతోషించారుట. ఆయనకికూడా మంచి ఓ వంకర్లు తిరిగిన మీసం ఉంది కాని అదేమో దీనంత గొప్పది కాదు. అందుకని ఆయన వెంటనే

అమ్మాయి మాటలకు ఒప్పేసుకుని పెళ్ళికబుర్లు మాట్లాడటానికి పురోహితుల్ని పంపించారుట.

ఈ సంగతి తెలియంగానే ఏమయిందీ - నవాబుగారు వాళ్ళ ఊళ్లో వాళ్ళకి ఓ పెద్ద విందు చేశారుట. ఈసంగతి దొంగలకి తెలిసిందట. "ఇదేరా సందు. ఇప్పుడు ఊరిమీద పడ్డామంటే అందరూ పెళ్లిగొడవలో ఉంటారు. నవాబుని ఎత్తుకుపోవచ్చు" అని ఆ రోజురాత్రి దొంగలు, రెండువందల మంది, కత్తులు, బల్లేలు, బాణాలు అవ్వీ పుచ్చుకుని ఒచ్చారుట.

ఊళ్లో అందరూ గురకలు పెట్టి నిద్రపోతున్నారు - కావలివాళ్ళు తలుపులదగ్గిర, సిపాయిలు గుడారాల్లో, వంటవాళ్ళు భోజనశాల్లో, పెద్దపెద్ద జమీందారులు తాంబూలం పళ్ళెంచుట్టూ. కన్ను మూయకుండా కాచుక్కూచోవలసిన బంట్రోతులు, పగలు తిన్న వన్నీ మళ్ళా కలలో ఇంకోమాటు కొట్టేస్తున్నారు. నలుగురుసైనికులు, సైన్యంలో కల్లా బలమైనవాళ్ళు, ధైర్యమయినవాళ్ళు మాత్రం మేలుకుని ఉన్నారు. వీళ్ళని వాళ్ళఅధికారి గుమ్మం దగ్గర నిల్చోమన్నాడు. అల్లాగే పగలల్లా ఉండిపోయారంతే విగ్రహాలల్లే. దొంగలు నెమ్మదిగా చప్పుడుచేయకుండా, పిల్లులల్లే అడుగులో అడుగేసుకుంటూ ఒచ్చారుట. ఎక్కడచూచినా నిశ్శబ్దం. అక్కడ్నించి దొంగలనాయకుడు ఒక్క కేక వేశాడుట. "కట్టీయండ్రా వీళ్ళందర్నీ. కదిలిన ప్రతీవాణ్ణీ చంపెయ్యండి. డబ్బు అంతా లాగెయ్యాలి". పొలోమని దొంగలు నాలుగు మూల్లకీ పరిగెత్తేరుట. అంతే వీళ్లు కేకలు వేశారోలేదో —ధం, ధం, ధం అని అడుగుల చప్పుడుతో నలుగురు సిపాయిలు ఒచ్చేశారుట. ఈ దొంగలకి వీళ్ళసంగతేం తెలుసు ఇంతగొప్ప వీరులని? కత్తులు దూసి నలుగురి మీద పడ్డారుట అంత గుంపూ. కత్తులు "ఖర్రు, ఖర్రు, ఖాంగ్, ఖర్ట్రట్రట్రఖర్" మన్నాయి. ఒక్క నిముషంలో పాతికమంది దొంగలకి కాళ్ళు,

చేతులు, ముక్కులు తెగిపోయాయి. దాంతో మిగిలిన వాళ్ళు గుండె బేజారెత్తి పారిపో బోయారుట. నలుగురుసైనికుల్లో ఒకడు వెళ్ళి సింహద్వారానికి అడ్డంగా నిల్చుని ఓపదిమంది వెధవల బుఱ్ఱలు టకటకటక గాల్లోకి ఎగరకొట్టేశాడుట. ఇంక దొంగలపని అయిపోయింది. "కుయ్యో! మొర్రో!" అని అనడం మొదలెట్టారుట. అప్పుడు నలుగురు వీరుల్లోకి పెద్దవాడు - అతని చెయ్యి ఇంచుమించుగా నీనడుం అంత లావు ఉంటుంది- అతను ఒక్కమాటు గర్జించాడుట. "చేతులో కత్తులన్నీ క్రిందపారేసి లొంగిపోతారా? అందర్నీ చంపేయమా". కుయిక్కు, కయిక్ మనకుండా అందరూ ఆయుధాలన్నీ పారేసి వరసాగ్గా నిల్చున్నారుట. అప్పుడు ఓసైనికుడు వెళ్ళి ఓ చాంతాడు మోపు తీసుకొచ్చి, దాంతోవీళ్ళందర్నీ చేతులు ఒరుసుకుపోయేట్టుబిగించి కట్టి జైల్లో పారేసి, గట్టిగా తాళంవేశారుట.

అక్కడ్నుంచి ఒకడు సైన్యాధిపతిని లేపడానికి వెళ్ళేడుట.

ఆయన 'గుర్రు, గుర్రు' మని హాయిగా నిద్రపోతున్నాట్ట. "సర్దార్ జీ" అన్నాడుసైనికుడు. పలకలేదు సైన్యాధిపతిగారు. "సర్దార్ జీ" అని మళ్ళా అరిచేట్ట. "ఉహూహూహూ" అని ఆయన ఇట్నుంచి అటు దొర్లి గురక పెట్టడం మొదలెట్టేట్ట. "సర్దార్ జీ, సర్దార్ జీ! దొంగలు!" అన్నాట్ట ఈ మాటు. దొంగలు అనేప్పటికల్లా, అంత నిద్రలో వాడు, చెంగున లేచి "ఏయ్! ఓయ్. దొంగలు! ఏం! కత్తి! బాకు! రా! ఎక్కడ" అని ఇటూ అటూ పరుగెత్త పోయాడుట. అప్పుడేమో ఇతను "లేదండీ అంతా అయిపోయింది. జైల్లో ఉన్నారు. గుంపంతా" అని చెప్పేడు. అప్పుడు సర్దారుగారు కొంచెం నెమ్మది పడి, సైనికుల్ని వాళ్ళనీ లేపి, ముందు తిట్టి, తరువాత అసలు సంగతేమిటో చెప్పి, కాపలాకి దానికీ పంపించారుట.

తర్వాత నవాబుగారి పెళ్ళి అయిందిట. ఆపెళ్ళిలో గమ్మత్తులు అవీ చెప్పాలంటే ఇక్కడినుంచి నవాబుగారి ఊరుదాకా అంత పొడుగయిన తెల్లకాయితం కావాలి. పెళ్లి అయింతర వాతేమో, ఈ నలుగురు వీరులకీ, చివరికి అంత బలమయిన వాళ్లకూడా మోయలేనంత రూపాయిల సంచులు, సిల్కు బట్టలు అవీ ఇచ్చారుట. నవాబుగారి బీగం ఏమో ఈ సైనికుల భార్యల్ని పిలిపించి మంచి ఖరీదయిన బనారసు చీరెలు, బలే బలే ఖరీదయిన నగలూ అవీ ఇచ్చిందిట. అప్పట్నించి ఆ రాజ్యంలో దొంగలు పిట్ట పురుగు కూడా లేరు. అంతా హాయిగా ఉంటూ ఉండే వారుట. నవాబు గారికి ముగ్గురు పాపాయిలు పుట్టేరుట. వాళ్ళు చిన్న చిన్న ఏనుగుపిల్లల మీదెక్కి రోజూ షికారు వెళుతూ ఉండేవారుట. వాళ్ళనాన్న గారి మీసంతో ఆడుకుంటూ ఉండేవారుట కూడాను!


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాల సంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు :—

డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

| కుంభకోణం బ్రాంచి : | తిరుచినాపల్లి బ్రాంచి ; |
|---|---|
| నెం. 7, సారంగపాణి కోవిల్, | నెం. 15, పుగళై పిళ్ళై వీధి, |
| తూర్పువీధి. | తెప్పకొలం. |

# చెట్లకు బెరడు

చెట్లకు బెరడు ఎందుకు వుంటును? అని క్రిందటినెల 'బాల' లో ప్రశ్న వుంది. దానికి జవాబు ఏమిటంటే—

చెట్టుకి కాండము వుంటుంది. ఆ కాండములో గాలి గదులు వుంటాయి. ఆ గాలి గదులను రక్షించుటకూ, ఆ కాండమును బలపరచుటకు బెరడు అవుసరము. మన ఒంటిమీద చర్మం ఎలాగో అలాగ.

ఇంకో ప్రశ్న: పువ్వులకు సువాసన ఎందుకు వుంటుంది?

పువ్వులకు సువాసన వుంటే, ఆ సువాసన కీటకములను ఆకర్షిస్తుంది. పువ్వులమీద కీటకములు వ్రాలితేనే పువ్వులు వికసించడం, కాయలు కాయడం జరుగుతుంది. సువాసనగల పువ్వునే మనం వాడుతాం. అందుకు.

పి. శ్రీరాములు, కూర్మనాథపురం.


## పిల్లలూ!

మంచి బాగా చేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి. జాబ్కో ఫౌంట్ ఇంక్ తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నారనుకుంటాను. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.




జాబ్కో ఫౌంట్ ఇంక్
ఇండియాలో మంచిది.

★

జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.



# అంకెల తమాషా



సంపాదన: టి. యల్. విక్టరు (గుంతకల్లు)

15873 — ఈ అంకెను
7 — చే గుణించు
111111

37037 — దీనిని
6 — చే గుణించు
222222

37037 — దీనిని
9 — చే గుణించు
333333

74074 — దీనిని
6 — చే గుణించు
444444

185185 — దీనిని
3 — చే గుణించు
555555

95238 — దీనిని
7 — చే గుణించు
666666

259259 — దీనిని
3 — చే గుణించు
777777

63492 — దీనిని
14 — చే గుణించు
888888

76923 — దీనిని
13 — చే గుణించు
999999

లెక్కలలో ఇంకా అనేక తమాషాలు వుంటాయి. అసలు లెక్కలంటే తమాషా ప్రశ్నలన్నమాట. అంచేత అందరూ లెక్కలు సరదాగా చేయండి.

## "వీరబాల"



చి॥ పాలూరి చిదంబరస్వామి
(అనకాపల్లి)

## "దీక్షబాల"



చి॥ పాలూరి కాళికాంబ
(అనకాపల్లి)

★

## మేనమామ — మేనకోడలు



చి॥ వడ్లమాని దక్షిణామూర్తి
(తెనాలి)



చి॥ ఉపాధ్యాయుల లలితాకుమారి
(తెనాలి)

## బాల బహుమానాలు

ప్రతీనెలా "బాల" చందాదారుల నెంబర్లు లాటరీతీసి, పదిమంది చందాదారులకు 1 రూ. చొప్పున బహుమానం పంపుతున్నాము. ఈ నెల లాటరీలో యీ దిగువ చందాదారులకు బహుమానములు వచ్చాయి.

—మేనేజరు.

| | చందా నెం॥ |
|---|---|
| సంగీత రత్నాకర ప్రొఫెసర్ ద్వారం వెంకటస్వామి నాయుడు (విజయనగరం) | 24 |
| C. H. సత్యనారాయణ, హెడ్ మాస్టర్, బోర్డు ఎలిమెంటరీ బాలికా పాఠశాల (కొత్రూవులపల్లి) | 744 |
| K. రామారావు (శ్రీకాకుళం) | 196 |
| A. శ్రీహరి (మదరాసు) | 350 |
| N. V. నరసింహారావునాయుడు (సంతరావూరు) | 204 |
| D. P. నరసింహారావు, శక్రిటరీ, T. A. Centre (ఆత్మకూరు) | 787 |
| శక్రిటరీ, రవీంద్ర గ్రంథాలయం, యాపర్ల (వనప ర్తి సంస్థానం) | 693 |
| శక్రిటరీ, T.A. Centre (శృంగవరపుకోట) | 588 |
| G. S. శ్యామల (మదరాసు) | 684 |
| శక్రిటరీ, ఆంధ్రడ్రమటిక్ లిటరరీ సొసైటీ సాక్షి (జాంషెడ్‌పూర్) | 554 |

## అంకెలలో పద్ధతి

ఫిబ్రవరి "బాల"లో "అంకెలలో పద్ధతి" అని కొన్ని అంకెల వరుస ఇచ్చాము. దానికి సరియైన జవాబు:

1, 2, 4, 7, 11, 16, 22

ఇందులో పద్ధతి ఏమిటంటే— అంకె అంకెకూ మధ్య 1, 2, 3, 4, 5, 6 చొప్పున వరుసగా కలుపుతూ రావడం.

7 కి 4 కలిపితే 11, 11 కి 5 కలిపితే 16, 16 కి 6 కలిపితే 22 – అలాగ.

## పొడుపు కధలు

క్రిందటి నెల పొడుపు కధలకు జవాబు:

1. మొగలిపువ్వు; 2. గంగ; 3. సూర్యుడూ–నక్షత్రాలు.


## బాల

సంవత్సరం చందా రూ. 5

(ప్రత్యేక సంచికతో సహా)

వి. పి. పద్ధతిలేదు.

మేనేజరు: 'బాల'

మైలాపూరు, మదరాసు 4.

# లేవాలీ—
# కావాలీ

కోడి కూయగనె లేవాలీ
కొత్త పాఠములు చదవాలీ
అమ్మకు నాన్నకు మ్రొక్కాలీ
అబ్బాయికి ముద్దివ్వాలీ
చక్కగ స్నానము చెయ్యాలీ
చద్దియన్నమును మెక్కాలీ
తెల్లని బట్టలు కట్టాలీ
తిన్నగ బడులకు పోవాలీ
పాత పాఠములు చదవాలీ
పంతులువస్తే లేవాలీ
"బాల"తొ స్నేహము చేయాలీ
"బంగరు బిడ్డలు" కావాలీ

రచన: "కవికిశోర"
"శంకరప్రసాద్"

ఉజ్జ్వలమైన సతీత్వము



పండిత్ డి. గోపాలాచార్యులవారి

అరుణ

గర్భాశయరోగ నివారిణి.




అరుణ ఋతుదోషములను పోగొట్టి, పరిపూర్ణ స్త్రీత్వమును ప్రసాదించగల స్వయం సంపూర్ణమగు ఔషధము. అట్టిదానిని విడువక సేవించినట్లయితే, మిమ్ము ఆరోగ్యవంతులను జేయుటయేగాక, మీ జీవన పరమావధియగు అమందానందమును తప్పక యొసగును.

ఆయుర్వేదాశ్రమం, లిమిటెడ్
టి-నగర్.... మద్రాసు.

# కొంటె కిష్టయ్యగాడు సుతనం!

రచన: "చందర్"

బాలచంద్ర సమాజము, (ట్రిప్లికేను)

ఒకరోజు సాయంకాలము నేను కొంటె కిష్టయ్య యింటికి వెళ్లేను. వాడు ఏదో మహాదీక్షతో వ్రాస్తూండేసరికి నాకే ఆశ్చర్యం వేసింది.

దగ్గరగా వెళ్లి, "ఏమి వ్రా రాస్తున్నా?" వని అడిగాను.

కిష్టయ్య :- మరేంలేదురా! బాల పోటీ పరీక్షకి వ్యాసం రాస్తున్నా, బహుమానంవస్తుందని.

నేను :- నీమొహం! నీకూ నాకూ వచ్చే దేమిటి? మనకంటే పెద్దబుర్ర ఉన్నవాళ్లందరూ రాస్తారు.

కిష్టయ్య :- భూతద్దము పెట్టి చూడు, నాబుర్రా పెద్దదిగానే కనపడుతుంది.

నేను :- బుర్రంటే తెలివనే అర్థంతో చెప్తున్నా. అవునుకాని, నీకు మొదటి బహుమానం వస్తుందంటావా?

కిష్టయ్య :- మొదటి బహుమానం మాట చెప్పలేనుగాని....

నేను :- ఓహో! అయితే ఏదేనా బహుమానం వస్తుందని ఆశగావుంది కాబోలు.

కిష్టయ్య :- అవును ఏదో ఒక మానం వస్తుందని నొక్కి చెప్పగలను.

నేను :- పదెం - నీకురాదు.

కిష్టయ్య :- పదెం. నేను గెలిస్తే నీవు నాకు పదిరూపాయలు, నీవు గెలిస్తే నేను నీకు పది

---

**తెలుసా**

ఒక హంగేరీ దేశస్థుడు 185 ఏళ్లు బ్రతికాడట. పుట్టినది 1539; చనిపోయినది 1724.

రూపాయలు ఇచ్చుకోవాలి.
నేను :- సరే.

* * *

కిష్టయ్యకి బహుమానం రాలేదు. నేను గబగబా కిష్టయ్యా ఇంటికి వెళ్లాను. పందెం వోడిపోయినందుకు 10 రూ. అడిగాను. కిష్టయ్య నవ్వుతూ ఇలా అన్నాడు.

కిష్టయ్య :- నాకు యీ పోటీలో అవమానం వచ్చింది. మన పందెం ప్రకారం ఏదో ఒక మానం వస్తుందన్నాను గనుక, నేనే గెలిచాను. నువ్వే నాకు పది రూపాయిలు ఇవ్వాలి."

నేను తెల్లబోయి చూచాను. చూశారా కొంటెకిష్టయ్య గడుసుతనం!

ఆయుర్వేద వైద్య నిలయంవారి

"లుకోరియాక్యూర్"

స్త్రీ గర్భాశయ సంబంధమైన సమస్త వ్యాధులను నిర్మూలించుటలో నిధియని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. దీనిని సేవించిన పూర్ణారోగ్యము గలిగి వంధ్యత్వము తొలగిపోవును. అనేకమంది దీర్ఘ రోగులకు వాడి గుణము పరీక్షింపబడిన ఆయుర్వేదఔషధ రాజము.

90 మాత్రల ప్యాకెట్టు రూ. 2—8—0


ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము:

అన్ని మందులషాపులలో దొరకును.

(మా చిరునామాలో మార్పును గమనించుడు)

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట : : మచిలీపట్టణము.




[బాలలు డైరీ రాయడం నేర్చుకోవాలి. డైరీ రాస్తే ఎంతో బాగుంటుంది. మేము ప్రతీ నెలా మదరాసులోని ఒక బాల డైరీ ప్రచురిస్తాం. చదవండి. —సం॥

## ఫిబ్రవరి

తేదీ.

1. మా కుక్కపిల్లకి మోతీ అని పేరుపెట్టాం. తెల్లగా ఒంటినిండా బొచ్చు అదీ ఎంతో బాగుంది.

2. ఇవాళ పిల్లల రేడియోప్రోగ్రాం. రేడియో అన్నయ్యతో కలిసి, రేడియోస్టేషన్కి వెళ్ళేను. శకుంతల, సైకిలుపాట ఎంతో బాగా పాడింది. ఆపాట నాకెంతో ఇష్టం.

3. మోతీకోసం మా రామం కుక్కసబ్బు కొని తెచ్చేడు.

4. ఇవాళ మధ్యాహ్నం మా అమ్మ ట్రిప్లికేను వెళ్ళింది. మా స్నేహితులందరం కలిసి, మాయింట్లో గుజ్జనగుళ్ళు ఆడుకున్నాం.

5. ఇంకా ఈనెల బాల రాలేదూ. అబ్బ! ఎందుకు ఇంత ఆలశ్యం చేస్తారో!

6. ఇవాళ సాయంకాలం పోస్టులో "బాల" వచ్చింది. తమ్ముడు చూడకుండా "బాల" దాచేశాను.

7. ఇవాళ సాయంకాలం బాలన్నయ్య ఇంటికి వెళ్ళేం - బాలన్నయ్య మమ్మల్నందర్నీ తెప్ప ఉత్సవం చూడ్డానికి తీసుకు వెళ్ళేడు. అక్కడ మేం అందరం సరదాగా రంజలరాట్నం ఎక్కేం. ఎంతో బాగుంది.

8. ఇవాళ మా చిన్నక్కయ్య వూరునుంచి వచ్చింది. నాకు మంచి బొమ్మలు, పిడతలు తెచ్చింది.

9. ఇవాళ రేడియో ప్రోగ్రాం. ప్రోగ్రాం అయిపోయినవెంటనే గిండీ కాలేజీలో మేమందరం పాటలూ, నాటికలూ వేశాం. చాలా బాగుందని అందరూ మెచ్చుకున్నారు. మాకందరికీ మెడల్సు బహుమానంగా ఇచ్చారు. లీలకి 1 కప్పు, 1 మెడలు, శంకుకి 2 మెడల్సు ఎక్కువగా వచ్చేయి.

10. ఇవాళ మేం అందరం మెడల్సు పెట్టుకుని స్కూలుకి వెళ్ళేం. మాక్లాసు పిల్లలందరికీ చూపించేం. ఎంచేతో మీనాక్షి ఇవాళ స్కూలుకి రాలేదు.

11. ఇవాళ సాయంకాలం పాఠాలన్నీ బాగా చదువుకున్నాను. నాకు ఒకలెక్కచేయడం రాకపోతే అన్నయ్యని అడిగాను. అన్నయ్య నన్ను కసిరాడు.

12. అమ్మ, అన్నయ్య, మేం.అందరంకలిసి బీచికి వెళ్లేం. అక్కడ ఇసుకలో ఆడుకున్నాం.

13. చిన్నక్కయ్యకి అమ్మ కొత్త బట్టలు కొంది. నాక్కూడా కావాలీ....అని రామం ఏడుస్తూ అల్లరిచేసేడు. నేను ఏడవలేదు. అమ్మ రామాన్ని కోప్పడింది.

14. ఇవాళ నాకు జలుబు, దగ్గుగా వుంది. అమ్మ కషాయంపెట్టి ఇచ్చింది. సాయంకాలం ఆడుకోడానికి వెళ్ళలేదు.

15. ప్రెసిడెన్సీ కాలేజి తెలుగుసంఘంవారు అడుగుతే మేం "బూర్లెమూకుడు" నాటకంవేశాం. నేను నాటకంనుంచి ఇంటికి వస్తూవుంటే, దార్లో ఎక్కడో నా అణా కాసు పారేసుకున్నాను.

16. ఇవాళ రేడియోప్రోగ్రాం. రేడియోస్టేషన్కి బెజవాడ, శ్రీకాకుళం, నెల్లూరు నుంచి చాలామంది మెంబర్లు వచ్చారు. చాలా సరదాగా వుంది. లీల రేడియోలో ఒకటే అల్లరిచేసింది. అల్లరిపిల్లన్ని తీసుకురానని రేడియో అక్కయ్య చెప్పింది. వచ్చే ఆదివారం లీలని తీసుకువస్తుందో, తీసుకురాదో!

17. అమ్మ కషాయం ఇస్తే తాగేను. జలుబు, దగ్గు శుభ్రంగా పోయింది.

18. బాల పోటీ పరీక్షలో మొదటి బహుమానం పొందాలని వుంది. వ్యాసం రాయడానికి ప్రయత్నించేను. గాని బాగా రాలేదు - నోటితో చెప్పడం సులభం కాని రాయడం కష్టంగావుంది. ఎలాగో మరి!

19. ఇవాళ శివరాత్రి. రామం, నేను, మేం అందరం ఇవాళరాత్రి జాగరం ఉందామనుకున్నాం. కాని అందరూ నిద్రపోతూవుంటే మాకూ నిద్రవచ్చింది.

20. కుక్కపిల్లకు సరిగా రామం నీళ్ళుపోయడంలేదు. దానికి ఒంటినిండా గజ్జిపట్టింది. ఇవాళనుంచి దానికి కుక్క సబ్బుతో బాగాతోమి, అమ్మే నీళ్ళుపోస్తుందట.

21. నాన్నగారు మమ్మల్నందర్నీ ఇంగ్లీషు సినీమాకి తీసుకువెళ్ళారు. అందులో ఎలుగుబంటిని చూస్తే నాకు నవ్వొచ్చింది. సినీమా ఎంతో బాగుంది.

22. ఇవాళ చెల్లాయి, మేడమెట్లమీద ఒక మెట్టువదలి, ఇంకోమెట్టుమీదికి గెంతడం ఆడుకుంటూంటే, కిందపడింది. కాలు నొప్పిపెట్టి ఏడ్చింది. అమ్మ ఏదో తైలంరాస్తే, నొప్పిపోయింది. అయినా అటువంటి ఆటలు మేడమెట్లమీద ఆడవద్దని అమ్మ చెప్పింది.

23. ఇవాళ రేడియో ప్రోగ్రాం. తురాయి నాటిక చాలా బాగుంది.

24. ఇవాళ లలిత పుట్టినరోజు. మమ్మల్నందర్నీ టీపార్టీకి పిలుస్తే, మేం వెళ్లేం. లలిత ఎంతో బాగా పాడింది.

25. మాకందరికీ స్వర్గసీమలో నటించిన భానుమతిని చూడాలని వుంది. వారింటికి తీసుకువెళ్ళమని బాలన్నయ్యని అడిగేం. తీసుకువెడతానని చెప్పేడు. ఇంకా ఎప్పుడో!

26. ఇవాళ "బాల"కి ఒకచిన్న కథ రాసి పంపేను.

27. నాకు సైకిలు నేర్చుకోవాలని వుంది. మా అన్నయ్యని అడుగుతే ఇప్పటినుంచి వద్దన్నాడు. నాకు ఏడుపు వచ్చింది.


28. ఇవాళ సాయంకాలం ప్రెసిడెన్సీ కాలేజీకి వెళ్ళేం. అక్కడ టీపార్టీ, మీటింగు అయింది. ఇదివరలో నాటకాలు. వేషాలువేసిన మా బాలసంఘంపిల్లలకి మెడల్సు బహుమానంగా ఇచ్చారు. శంకు డాక్టరువేషం బాగా వేశాడని, వానికి మాత్రం కప్పు ఇచ్చేరు. ఈసారి నేను కూడా బాగావేయడానికి ప్రయత్నిస్తాను.


# ★ బొమ్మల బాల ★

## బాలలకు పువ్వులంటే ఇష్టం కాదూ?

ఇదుగో——


ఈ పక్కబొమ్మలో లాగ చుక్కల గీతలు ఆరున్నూ, మధ్యన చుక్కల సున్నా వేయండి.





తరువాత ఈ పక్కబొమ లోలాగ గీతలు గీయం ముందు పెన్సిలుతో గీసి, కు రుగావుంటే అప్పుడు సిరా దిద్దండి.

ఈ మూడో బొమ్మలోలాగ మిగిలిన గీతలు గీస్తే పువ్వు తయారయింది. ఇటువంటి కాగితపు పువ్వులకి రంగులుకూడా వేస్తే పువ్వు ఇంకా ఎంతో బాగుంటుంది.



(వచ్చే నెల బాలలో ఇంకో బొమ్మ)

## "నవోదయ"

(పారిశ్రామిక సంచిక)

ఈ సంచికలో మన తెనుగు దేశములోని పరిశ్రమల గురించి మంచి మంచి వ్యాసాలు ప్రచురింపబడ్డాయి. ఆర్టుబోర్డు అట్టతో, బొమ్మలతో దీని వెల రూ 1-8-0 లు. కావలసిన వారు "నవోదయ" ఆఫీసు, 11, తంబుచెట్టివీధి, మదరాసు, అని రాయండి.

—o◇o—

## "మాతృభూమి"

ఇది వారం వారం వచ్చేపత్రిక. శ్రీ అన్నె అంజయ్యాగారు కొత్తగా పెట్టారు. సంపాదకులు శ్రీ వేలూరి సదానందం గారు. ఈ పత్రిక ప్రతివారం తెల్లని గ్లేజు కాగితంమీద చక్కని అచ్చుతో, మంచి వ్యాసాలతో వస్తోంది. వివరాలకు 379, ఎస్ప్లనేడ్, చెన్నపట్నం 1 కి రాయండి.

—o◇o—

## "వెలుగు"

ఇది బరంపురం (గంజాం) నుండి కొత్తగా వెలువడిన మాసపత్రిక. శ్రీ "మహేశ్వర్" గారు దీనికి సంపాదకులు. వెలుగు రాను రాను ఇంకా బాగా వెలుగుతుందని మా ఆశ. చందా వివరాలకు, "వెలుగు కార్యాలయం" బరంపురం (గంజాం) అని రాయండి.






# అక్కతో 5 నిమిషాలు

చిట్టి చెల్లాయిలూ!

చిట్టి తమ్ముళ్లూ!

ఈసారి వుత్తరాల్లో విశేషా లేమిటంటే :—

**రాజమండ్రినుంచి K. లలిత :**

"అక్కా! నిన్ను చూడాలని వుంది. నీ ఫోటో బాలలో వేయవూ?" అని రాసింది.

చెల్లాయీ! నీ సలహా బాగానే వుంది. నాకూ ఇష్టమే. కానీ, నాకు ఫోటో తీయించుకోడానికే భయం. ఎందుకో తెలుసా?— నా ఫోటో ఏమీ బాగుండదు. అయినా మీరందరూ కోరితే తప్పుతుందా?

* * *

**G. శ్రీనివాసరావు, బాపట్ల:**

"ఏమర్రా! అక్కతో ఐదు నిమిషాలేమిటి, ఓ ఇరవై నిమిషాలేనా మాట్లాడుతేనేగాని కడుపు నిండదు" అని రాసేడు.

తమ్ముడూ! మనం కబుర్లు ఎన్ని నిమిషాలేనా చెప్పుకోవచ్చును గాని, వ్రాతలో మాత్రం క్లుప్తంగానే వుండాలి, తెలుసా?

* * *

అన్నట్టు మీ కందరికీ పరీక్షలు దగ్గరకువచ్చాయి కదూ? కొందరికి యీ నెలలోనూ, మరికొందరికి వచ్చే నెలలోనూ పరీక్షలు జరుగుతాయి. మీరందరూ బాగా చదువుకుంటున్నారా? పరీక్షలో మంచిమార్కులు తెచ్చుకుని యజముపొందాలి- అప్పుడే నాకు సంతోషం.

అక్క.

---

## బాలసంఘాలు

ఆంధ్ర బాలసంఘము,

(ఖర్గపురము) :

ఈ సంఘం గత సంవత్సరం నుండి బాల బాలికలకు విజ్ఞాన విషయాలూ,

జాతీయవిషయాలూ నేర్పుతోంది. ఇప్పుడు తెలుగును అభివృద్ధి పరచడానికి "తెలుగు విద్యాప్రచారక మండలి" అని స్థాపించి నడపబోతోంది. కేంద్ర బాలానంద సంఘానికి చేదోడుగా వుంటుందని S. R. నాయుడు, సిహెచ్. లక్ష్మణరావుగార్లు తెలియజేయుచున్నారు.

విద్యార్థి సంఘం,
(ఇసకదామర్ల) :

లక్ష్మినరసింహ విద్యాలయంలోని విద్యార్థులు 22 మంది సభ్యులతో పని చేయుచున్నది. కేంద్ర బాలానంద సంఘములో సభ్యులుగా చేరుచున్నారని కార్యదర్శి బచ్చు పాపయ్యాగారు వ్రాశారు.

పలాస బాలసంఘం :

కేంద్ర సంఘంలోచేరి ఆ నియమాల ప్రకారం నడుచుకోడానికి తీర్మానించడమయినదని కార్యదర్శి డేవిడ్ మరియన్ గారు వ్రాస్తున్నారు.

కూర్మనాథపురం,
బాలసంఘము :

ఈ సంఘం శ్రీ ఎన్. సి. పంతులుగారి ఆధిపత్యమున సభజరిపి, గ్రామ తలిదండ్రుల సంఘము ఒకటి స్థాపించబడింది. ఆట పోటీలలో గెలుపొందిన వారికి వెండి పతకములు, పుస్తకములు బహుమానమిచ్చారు. అందులో సి. హెచ్. అసిరన్నగారికి ఎక్కువ బహుమతులు వచ్చాయి. కనకతార నాటకంలో కనకసేనుడుగా నటించిన పి. కనకమ్మ, తారగా నటించిన జి. పునర్వసు అను అమ్మాయిలకు బహుమానములు ఇచ్చారు.

శ్రీ సరస్వతీ విద్యార్థిసంఘం,
తిరుపతి :

ఆంధ్ర బాలానంద సంఘం (కేంద్ర సంఘం) మదరాసులో పెట్టినందుకు సంతసము తెలియజేయుచు శక్రెటరీ C. శ్రీనివాసరావు గారు వ్రాయుచున్నారు.

మంచికలపూడి బాలసంఘము :

ఈ సంఘంవారు "అల్లరిసూర్యం" అనే నాటకాన్ని మంచికలపూడి, దుగ్గిరాల, పెదపూడి గ్రామాలలో ప్రదర్శించారు.

* * *

బాలసంఘాలు ఎలాగుండాలంటే— కులముపేర్లు, పార్టీలపేర్లూ, నాయకుల పేర్లుపెట్టి అనేక బాలసంఘాలు లేస్తున్నాయి. పార్టీలపేర్లూ, నాయకుల పేర్లూ పెడితే, వారికి వ్యతిరేకసంఘాలు లేచి అల్లర్లు జరుగుతాయి. బాలురకు యీ పక్షాలతో సంబంధంలేక ఐకమత్యముతో వుండాలని నా కోరిక.

K. నారాయణరావు.

మాచవరం బాలసంఘం :

మొన్న సంక్రాంతికి ఆటపాటల పోటీలు, చదువుట, మంచి నడవడిక మొదలగు పోటీలలో గెలుపొందిన 18

తుందికి బహుమానములు శ్రీ వెంకట కృష్ణరావుగారు డబ్బు వసూలుచేసి ఇచ్చారు. సభ్యుల మొత్తం 28. చాలా వుత్సాహముతో పనిచేయుచున్నారని కార్యదర్శి I. వెంకటేశ్వర్లు వ్రాయుచున్నారు.

రైల్వేవిద్యార్థిసంఘం (కాశీబుగ్గ):

ఈ సంఘం సభ 2-2-47 తేదీని జరిగింది. శ్రీ ఎ. పి. నాగభూషణరావు (బాలుడు) బాగా వుపన్యశించాడు. సభకు 100 మంది హాజరైరి. "బాల" లోని కథలు చదివారు. శిశు గ్రంథాలయములో 50 పుస్తకములు వున్నవి. అందరి ఆదరణకు మా వందనాలు అని కార్యదర్శి వ్రాయుచున్నారు.

ఉప్పుగుండూరు బాలసంఘం:

వీరు నడుపుచున్న "బాలజ్యోతి" వ్రాతపత్రిక బాగుంది. ఇంకా పేజీలు ఎక్కువచేసి బొమ్మలువేస్తే ఇంకా బాగుంటుంది.

మదరాసు ఆంధ్రబాల సంఘము:

ఈ సంఘము పిల్లలు "బూరెల మూకుడు" అన్న నాటిక, "గొల్లవాడు గొల్లభామ" అను పాట కథ; పాముల వాళ్ళ ఆట-పాట, "కోతలు-ఊడ్పులు" అను ఆట-పాట మొదలైనవి. ఇంజనీరింగు కాలేజీ ఆంధ్ర విద్యార్థిసంఘం వార్షికోత్సవంనాడు అక్కడను, ప్రెసిడెన్సి కాలేజీ ఆంధ్రవిద్యార్థుల నాటికల ప్రదర్శనంలోనూ వేసి చాలా బహుమతులు పొందారు. చి॥ గిడుగు భారతీ, వల్లూరు సావిత్రి "గొల్లవాడు-గొల్లభామ" గా బాగా నటించారు. చి॥ లీలా, శంకూ ఇద్దరూ పాములవాళ్ళ పాట-కథ బాగా వేశారు. నాటకంలో అందరూ బాగా నటించారు. చి॥ గిడుగు పాపాయి బిచ్చకు రాలు గానుా, వల్లూరి శకుంతల కానిస్టేబుగానుా, చి॥ వేదుల సూర్యనారాయణ శెట్టిగానూ, మాష్టర్ శంకు డాక్టర్ గానూ చి॥ జి. సావిత్రి భీమయ్యగాను వేసి బహుమతులు పొందారు.

ఇటువంటి చిట్టి నాటికలు ఇంకా ఇంకా ప్రదర్శిస్తే చాలా బాగుంటుంది.

"బాల విలేఖరి"

---

# "మందు మహిమ"

కల్లు సారాయి అనేవి మత్తు పదార్థాలు. అవి శరీరానికి చాలా అనారోగ్యాన్ని కలిగిస్తాయి. ఈ దురలవాటువల్ల ఎలాంటి నష్టం కలుగుతుందో "మందు మహిమ" అనే నాటకంలో శ్రీ పి. రాఘవరావుగారు రాశారు. ఈ నాటకాన్ని ఫిబ్రవరి 6 వ తేదీని మదరాసు వి. పి. హాల్లో వేశారు.

ఈ నాటకంలో అనసూయ, సీత, రాజరత్నం, రెడ్డి, అప్పల్ అండ్ నాగ్ మొదలైన వారు నటించారు. అప్పల్-నాగ్ ఈ ఇద్దరూ, నవ్వించేలా చాలా బాగా నటించారు. వీరి హాస్య నటన ప్రతివారూ చూడవలసిందే!



# పొడుపుకథలు

## 1

రాతిపేరేగాని మెత్తగా ఉంటుంది
దంపుకర్రపేరె, దంచలేదు;
చక్కిలమ్ములాగు చచ్చిపడి ఉంటుంది
రైలు బండిలాగు ప్రాకుతుంది....ఏమిటి?

## 2

గాలి గండమెకాని, నీటిగండములేదు
దేవతా రూపమై తిరుగుతుంది
పగబూని శత్రువును నోరార మ్రింగితే
చావుపాలవుతుంది చిత్రమండి....ఏమిటి?

—వఝ్ఝల వెంకటేశ్వర్లు, (బి. ఎ. బిఇడి.)

## 3

నేను ముళ్ళలోపుట్టి పెరుగుతాను.
అయితే మాత్రమేం?... చక్కని వాసనగల
దానిని. నారంగుపేరే నాపేరూనూ—
మరి నాపేరు చెప్పుకో—

—పాటిబండ వరలక్ష్మి (తేలప్రోలు)

## 4

ఓరోరి అన్నరో, నీ వళ్ళంత ముళ్ళురా
కారాకు పచ్చరా, నీ కండంత చేదురా...ఏమిటి?

—ఎ. జే. లక్ష్మీపతీ (పాపినాయకహళ్లి)

(జవాబులు వొచ్చే సంచికలో)



# బాల పోటీ—
# —గెలిచినవారు

★

[ఫిబ్రవరీ బాల పోటీ పరీక్షలో చాలా మంది రచనలు పంపారు. వారికి మా జేజేలు. ఈ దిగువవారి రచనలు బాగున్నాయి. కాబట్టి వారికి బహుమతులు పంపబడును—సం॥]

## మొదటి బహుమానం రూ. 10/-
**చి॥ వల్లూరి సావిత్రి (మదరాసు)**

## రెండవ బహుమానం రూ. 6/-
**చి॥ బొడ్డు శేషయ్య (ధేనువకొండ)**

## మూడవ బహుమానం రూ. 4/-
**చి॥ విస్సా అప్పారావు (తిరుపతి)**

**ఇవిగాక, ఈ దిగువవారుకూడా బాగా రాశారు. వారికి ప్రత్యేకముగా యీనెల "బాల" సంచిక ఉచితముగా పంపబడును.**

1. చి॥ గొల్లపూడి రాజామణి (విజయనగరం)
2. ,, నిడదవోలు సర్వేశ్వరరావు (మదరాసు)
3. ,, జి. మీరారాణి (చంగల్‌పట్)
4. ,, "రామసుధాకర్" (తిరుపతి)
5. ,, నిష్టల ఇందిర (చోడవరం)

గెలిచినవారి రచనలు ఏప్రిలు సంచికలో ప్రచురింపబడును.

# "బాల" పోటీ పరీక్ష

మొదటి బహుమానం రూ. **10**
రెండవ బహుమానం రూ. **6**
మూడవ బహుమానం రూ. **4**

పిల్లల్లారా! ఈనెలలో పోటీప్రశ్న ఏమిటో తెలుసా ?—ఇది :

## "నేను చూచిన గమ్మత్తు"

మీరు ఏవైనా గమ్మత్తులు చూచివుంటారు. నవ్వుపుట్టించే గమ్మత్తులు. ఆ గమ్మత్తుగురించి ఒకపేజీకి మించకుండా (పావురావు సైజులో ఒకపేజీ, అంటే ఒకపక్క అన్నమాట) రాయాలి. ఎవరి గమ్మత్తు బాగుంటే వారికి పైన వివరించిన బహుమానం ఇస్తాము. గమ్మత్తులు 'బాల' లో వేస్తాము కూడాను.

**ఈ పోటీలో 'బాల' ఎడిటర్‌గారి అభిప్రాయమే ఖాయము.**

ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.


### ప్రవేశరుసుము **4** అణాలు

- ప్రవేశరుసుము మనియార్డరుద్వారాగాని, స్టాంపులుగాగాని పంపవచ్చును.
- ఈ పోటీలో 15 ఏళ్లకు లోపువారే చేరాలి.
- కవరుమీద "బాల పోటీ" అని పెద్ద అక్షరాలతో రాయాలి.
- వ్యాసాలు మాకు 25 వ తేదీ లోపుగా చేరాలి.

పై విలాసం ఇలా రాయండి :

"బాల పోటీపరీక్ష"

c/o "బాల", మైలాపూర్, మదరాసు 4.




## పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

**[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినొచ్చు.]**

[ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు]

### మార్చి

**9-వ తేదీ ఆదివారం:**

రారె చిన్ని పిల్లలార - పిలుపుపాట; ఉత్తరాల సంచి; తమాషాల గుత్తి; తాతయ్యకథ; చివురాకు - నాటిక; కొత్త పాటలు; పోదామా.

**16-వ తేదీ ఆదివారం:**

రారె చిన్ని పిల్లలార - పిలుపుపాట; ఉత్తరాల సంచి; లేవలేని పిల్లవాడు - నాటిక; పుట్టినరోజులు; పాటలు, కథలు; మెలికిమాట; పొట్టిబావ కథ; పోదామా.

**23-వ తేదీ ఆదివారం:**

(ఉగాది ప్రోగ్రాం)

ఉగాది పిలుపు; కొత్త సంవత్సరం సోది; ఉగాది దేవత - నాటిక; రేడియో పిల్లల సంఘసభ; అన్నయ్య నివేదిక; సందేశాలు; మిరపకాయ ఉపన్యాసం; జిలేబి ఉపన్యాసం; మొద్దబ్బాయి ఉపన్యాసం; ఉగాది కోలాటం; రేడియో అక్కయ్య కబుర్లు అవీ - తాతయ్య ఆశీర్వచనాలు; కొత్త మెలికిమాట; మంగళం.

**30-వ తేదీ ఆదివారం:**

రారె చిన్ని పిల్లలార - పిలుపుపాట; ఉత్తరాల సంచి; మల్లిక - నాటిక; పుట్టినరోజులు; ఇది ఏమిటి? తోక చుక్క; చుక్కపాట; మీ పాటలు; పోదామా.

### ఏప్రిలు

**6-వ తేదీ ఆదివారం:**

రారె చిన్ని పిల్లలార - పిలుపుపాట; ఉత్తరాలసంచి; వసంతబాల - నాటిక; పుట్టినరోజులు; పొట్టిబావ కథ; పిల్లలకే స్వరాజ్యం - పాట; చిక్కుప్రశ్న; పోదామా.

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras 4. Printed by B. Nagi Reddy at B. N. K. Press, 37, Acharappan St., G. T. Madras.




అన్ని నొప్పులనూ పోగొట్టే

అందాల బాల

# అమృతాంజనము




THE VAUHINI PICTURES LTD. : MADRAS : BEZWADA : TADPATRI